నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 15-5-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 248 | పేజిలు: 4 | వెల: రూ.1/-

మృతదేహాలకూ కరోనా పరీక్షలు చేయాల్సిందే

తెలంగాణ సర్కార్‌కు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్,మే14(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా వైరస్ పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతున్న తరుణంలో తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రాణాంతక వైరస్ నేపథ్యంలో మృతదేహాలకు కూడా కరోనా టెస్టులు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఉన్నతన్యాయస్థానం ఆదేశించింది. మృతదేహాలకు టెస్టులు చేయాల్సిన అవసరం లేదని గతంలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ ప్రొఫెసర్ విశ్వేశ్వర రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థతో పాటు వివిధ సంస్థలు ఇచ్చిన మార్గదర్శకాలను పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. అలాగే కరోనా కట్టడికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలను అనుసరిస్తోందో తమకు చెప్పాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 26 వరకు దీనిపై పూర్తి నివేదిక అందించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది. పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. మృతదేహాలకు పరీక్షలు చేయకపోతే త్వరలోనే మూడో స్టేజ్‌కు చేరుకునే ప్రమాదం ఉందని ధర్మాసనం ముందు వాదించారు. పలు రాష్ట్రాల్లో చనిపోయిన వైద్యులకు పరీక్షలు నిర్వహించిన తరువాతనే వైరస్ బయట పడిందని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. పిటిషనర్ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు.. రాష్ట్రంలో కరోనా వైరస్‌పై ప్రభుత్వం సమర్పించిన నివేదిక పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. మృతదేహాలకు కరోనా పరీక్షలు నిర్వహించరాద్దని తెలంగాణ ప్రభుత్వం కొద్ది వారాల క్రితం నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలో కరోనా పరీక్షలు తక్కువగా చేస్తున్నారని ప్రభుత్వంపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తోన్న విషయం కూడా తెలిసిందే. కాగా... ఐసీఎంఆర్ మార్గదర్శకాల ప్రకారం కరోనా పరీక్షలు జరుపుతున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

రైల్వేశాఖ కీలక నిర్ణయం

జూన్ 30 వరకు అడ్వాన్స్ బుకింగ్‌ల రద్దు
డబ్బులు వాపస్ చేస్తామని ప్రకటన

న్యూఢిల్లీ,మే14(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తికి అడ్డుకట్ట వేసే క్రమంలో భాగంగా దేశవ్యాప్త లాక్‌డౌన్ మే 17వ తేదీ ముగియనుంది. ఈ నేపథ్యంలో జూన్ 30వ తేదీ వరకూ బుక్ చేసుకున్న అన్ని రైల్వే టికెట్లను రద్దు చేస్తున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. జూన్ 30వ తేదీలోగా ప్రయాణించడానికి వీలుగా మార్చి 25వ తేదీ కన్నా ముందు బుక్ చేసుకున్న టికెట్లన్నీ రద్దు అవుతాయని తెలిపింది. టికెట్ల సొమ్ము తిరిగి ప్రయాణికుల ఖాతాల్లో జమ అవుతుందని వెల్లడించింది. అయితే, వలస కూలీలను సొంత ఊళ్లకు చేర్చేందుకు ఏర్పాటు చేసిన శ్రామిక్, ప్రత్యేక రైళ్లలో బుక్ చేసుకున్న టికెట్లు మాత్రం యధావిధిగా ఉంటాయి. అదేవిధంగా ఇటీవల ప్రారంభించిన 15 ప్రత్యేక రైళ్లకు సంబంధించిన టికెట్లకు ఇది వర్తించదు. ప్రస్తుతం ఐఆర్‌సీటీసీలో టికెట్లు బుక్ చేసుకునే ప్రతి ప్రయాణికుడిని గమ్య స్థానాల చిరునామాను కూడా సేకరిస్తున్నారు. దీని వల్ల ప్రయాణికులు ఎక్కడ ఉంటారో సులభంగా గుర్తించవచ్చు. ఈ మేరకు ఆన్‌లైన్ రిజర్వేషన్‌లో మార్పులు చేశారు. ప్రస్తుతం విధించిన మూడో లాకౌడౌన్ మే 17వ తేదీతో ముగియనుండగా ఇప్పటికే లాక్‌డౌన్ 4.0 గురించి ప్రధాని నరేంద్రమోదీ సూచన ప్రాయంగా చెప్పారు. కొన్ని నిబంధనలతో దీన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అందుకు సంబంధించిన విధి విధానాలను మే 18వ తేదీ కన్నా ముందే వెల్లడిస్తామని చెప్పారు. మరి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో దానిని బట్టి రైల్వే శాఖ కూడా నిర్ణయం తీసుకునే అవకావం ఉంది. అందుకే జూన్ 30 వరకు ప్రయాణీకులు బుక్ చేసిన టిక్కెట్లన్నీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. డబ్బులు మొత్తాన్ని ప్రయాణీకులకు తిరిగి చెల్లిస్తామని స్పష్టం చేసింది. ఏది ఏమైనా కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో అమలవుతున్న లాక్ డౌన్ కారణంగా దేశంలోని వివిధ ప్రాంతాలలో చిక్కుకున్న లక్షలాది మంది వలస కార్మికులను స్వస్థలాలకు చేర్చేందుకు శ్రామిక్ రైళ్లు మాత్రం యధావిధిగా నడుస్తాయని తెలిపింది.

కరోనాతో కలిసి జీవించాల్సిందే

జాగ్రత్తలు పాటిస్తూనే ముందుకు సాగాలి
వ్యాక్సిన్ వచ్చే వరకు ఇదే విధానం తప్పదు: వరప్రసాద్ రెడ్డి

హైదరాబాద్,మే14(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాక్సిన్ వచ్చేవరకు ఇప్పుడున్న పద్ధతుల్లోనే గడపాల్సి ఉంటుందని శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు డా. వరప్రసాద్ రెడ్డి అన్నారు. భౌతికి దూరం పాటించడం, ఇమ్యూనిటీ పెంచుకునే ఆహార పదార్థాలు తినడం, యోగా, వ్యాయామం వంటివి తప్పనిసరన్నారు. గత రెండురోజులుగా ఆయన వివిధ చానళ్లలో మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కరోనా మనతోనే సమజీవనం చేస్తుందని హెచ్చరించారు. లాక్‌డౌన్‌ను పొడిగించుకుని కూర్చుంటే ఇంకా ప్రమాదం ఎక్కువని, జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు పోవాల్సిందేనని డా. వరప్రసాద్‌రెడ్డి అన్నారు.వచ్చే ఏడాది మధ్యలో కానీ చివరలో కానీ వాక్సిన్ రావచ్చుని ఆయన చెప్పారు. ఈ మేరకు పరిశోధనలు సాగుతున్నాయన్నారు. వ్యాక్సిన్ డెవలప్‌మెంట్‌కు దాదాపు 1000 కంపెనీలు దృష్టి పెట్టాయని డా. వరప్రసాద్ రెడ్డి అన్నారు. వ్యాక్సిన్ అభివృద్ధిపైనే శాంతా బయోటెక్ దృష్టి పెట్టిందని ఆయన తెలిపారు. రక్షణ విభాగానికే బ్జడెట్ నిధులు ఎక్కువగా కేటాయించారని ఆయన అన్నారు. వార్షిక బ్జడెట్‌లో విద్య, వైద్యం,ఆరోగ్యం పట్ల చిన్నచూపు ఉందని తెలిపారు. ఇకపై భవిష్యత్‌లో ఆరోగ్యంపై ఎక్కువ నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. మేక్ ఇన్ ఇండియా పిలుపు మేరకు ఆవిష్కరణలు జరగాలని వరప్రసాదరెడ్డి చెప్పారు. దేశంలో వైద్యుల సంఖ్య పెరగాలని, కరోనా వంటి విపత్తుల కోసం ప్రత్యేక వైద్య బృందాలు ఉండాలని వరప్రసాదరెడ్డి చెప్పారు. జిల్లా కేంద్రాల్లో వైద్య సదుపాయాలు మెరుగు పరచడం అవసరని ఆయన తెలిపారు. భవిష్యత్ అంతా జీవ సాంకేతిక ఆయుధాలదే అని ఆయన చెప్పారు. భవిష్యత్‌లో ఎవరూ మిస్సైల్స్, ఆయుధాలు వాడరు, అంత ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. భవిష్యత్ దృష్ట్యా అవసరాలు మారాలని ఆయన పేర్కొన్నారు. మేథో సంపత్తిని ప్రోత్సహిస్తే ఆవిష్కరణలు పెరుగుతాయని ఆయన చెప్పారు.

ఇంటింటికీ వైద్య పరీక్షలు చేయాలి

లక్షణాలున్న వారిని గుర్తించాల్సిందే: ఈటెల

హైదరాబాద్,మే14(ఆర్ఎన్ఎ): ప్రతీ ఇంటిలోనూ వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య శాఖ అధికారులను మంత్రి ఈటల రాజేందర్ ఆదేశించారు.జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి, ఊపిరితిత్తుల న్యుమోనియా వంటి రెండు లక్షణాలు ఎవరికైనా కనిపిస్తే తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలని మంత్రి వైద్య సిబ్బందిని కోరారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటెల రాజేందర్ తెలంగాణలోని వైద్య సిబ్బందితో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ మేరకు వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్యాధికారులు, ఆసుపత్రుల సుపరింటెండెంట్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ అధికారులు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ.. కరోనా నేపథ్యంలో ప్రతీ గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి ఇన్‌ఫ్లూయెంజా లక్షణాలు ఉంటే పరీక్షలు నిర్వహించాలన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ శాంతి మారి, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ యోగితా రాణా, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రమేష్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ శ్రీనివాసరావు, తదితరులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రతీ ఇంటిలో, గ్రామంలో ఈ వైద్య పరీక్షలను నిర్వహించాలని మంత్రి స్పష్టం చేశారు. ఒకవైపు కరోనా మహమ్మరి విస్తరిస్తున్న దశలో ఏ ఒక్క క్షణం కూడా విశ్రమించకుండా, అలుపెరుగని పోరాటం చేయాల్సిన అవసరం మనమీదే ఉందని రాజేందర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అనంతరం కరోనాకు సంబంధించి గ్రామాల్లో, పట్టణాల్లో తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ పలువురు ఆశా వర్కర్లు, ఏఎన్ఎం వర్కర్లతో మాట్లాడారు.

సమీక్షా సమావేశంలో మంత్రి కేటీఆర్, జీహెచ్ఎంసీ, పురపాలక, హెచ్ఎండీఏ

చరిత్రలో నేటినిజం

కం॥ 'నగ్నము నేసుని మనసును
ద్వగ్న మెన్ను - ఎగసి పసుచు - విమతుల అరసునే
భగ్న మేసనర్చుచు - సతత
మగ్నిక కాన్నులను రాల్చ నా వేశములోన్!!

(మే 15 నగ్నముని జన్మదినం)

-రాధశ్రీ
సెల్: 9494481210

జీహెచ్ఎంసీ సహా అన్ని మున్సిపాలిటీల్లో టీఎస్ బీపాస్

హైదరాబాద్ , మే14: టీఎస్ బీపాస్(టీఎస్ బిల్డింగ్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్)పై మంత్రి కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో జీహెచ్ఎంసీ, పురపాలక, హెచ్ఎండీఏ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాటాడుతూ.. 87 మున్సిపాలిటీల్లో టీఎస్ బీపాస్ విధానం ప్రవేశపెట్టామని తెలిపారు. జూన్ మొదటి వారంలో జీహెచ్ఎంసీ సహా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో టీఎస్ బీపాస్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. టీఎస్ బీపాస్‌లో భాగస్వాములైన సిబ్బందికి శిక్షణ, అవగాహన కార్యక్ర మాలు ముమ్మ రం చేయాలని చెప్పారు. టీఎస్ బీపాస్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాక ప్రజలు ఆన్‌లైన్‌లో అనుమతులు పొందేందుకు వీలు ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి కేటీఆర్ అధికారులకు సూచించారు.

వలస కార్మికులను వెన్నాడుతున్న మృత్యునీడ

వేర్వేరు ఘటనల్లో 14మంది దుర్మరణం

లక్నో,మే14(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ కారణంగా సొంతూళ్లకు బయలుదేరిన వలస కార్మికులను మృత్యువు నీడలా వెన్నాడుతోంది. నడకదారిలో అనేకులు చనిపోతుంటే మొన్నటికి మొన్న రైలుపట్టాలపై గూడ్సు దూసుకుని వచ్చి 16మందిని పొట్టనపెట్టుకుంది. పనిచేస్తున్న చోట ఆదరణలేక వేలాదిమంది తమ ఇంటి దారి పట్టారు. హైవేలపై నడుచుకుంటూ వందల కిలోమీటర్లు ప్రయాణించి, తమ ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కొందరు మృత్యువాత పడుతున్నారు. తాజాగా రెండు వేర్వేరు ఘటనల్లో 14మంది మృత్యువాత పడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో కాలినడకన తమ ఇళ్లకు తిరిగి వెళుతున్న కార్మికులను రోడ్‌వేస్ బస్సు ఢీకొంది. గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో ఆరుగురు కార్మికులు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. వలస కార్మికులంతా పంజాబ్‌లో పనిచేసేవారని, ఇప్పుడు బీహార్‌కు వెళ్తున్నారని తెలుస్తోంది. ముజఫర్‌నగర్ పరిధిలోని షహరాన్పూర్ రహదారి వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనంచేసుకున్నారు. గాయపడిన కార్మికులను జిల్లా ఆసుపత్రికి తరలించారు. వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇకమరో ఘటనలో మధ్యప్రదేశ్‌లోని గునా జిల్లా కాంట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గడిచిన రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. వలస కూలీలతో వెళ్తున్న ట్రక్కు అదుపుతప్పి బస్సును ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ట్రక్కులో ప్రయాణిస్తున్న 8 మంది మృతిచెందారు. మరో 50 మందికి పైగా గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వలస కూలీలు మహారాష్ట్ర నుంచి స్వరాష్ట్ర ఉత్తరప్రదేశ్‌కు వెళ్తుండగా ప్రమాదం భారిన పడ్డారు.

కార్మికులకు నేరుగా ఆర్థిక సాయం అందాలి: చిదంబరం

న్యూఢిల్లీ,మే14(ఆర్ఎన్ఎ): ఇప్పటికే మోదీ ప్రభుత్వం ప్రకటిస్తున్న ఉద్దీపన ప్యాకేజీలు, కేటాయింపులపై కేంద్ర మాజీ ఆర్థికమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం పెదవి విరుస్తున్నారు. అలాగే తాజా పీఎం కేర్స్ ఫండ్ నుంచి వలస కార్మికులకు సాయం కోసం కేటాయించిన రూ.1000 కోట్ల నిధులపై కూడా పెదవి విరిచారు. ఆ రూ.1000 కోట్లతో వలస కార్మికులకు నేరుగా ఎలాంటి లాభం ఉండదని, ఆ నిధులు వలస కార్మికుల సహాయార్థం రాష్ట్రాల ఖాతాల్లోకి వెళ్తాయని ఆయన వివరించారు. కాబట్టి, వలస కార్మికులకు నేరుగా లబ్ది చేకూరేలా కేంద్రం నిధులు కేటాయించాలని ఆయన సూచించారు. లేదంటే అన్ని ఆదాయ వనరులు మూసుకుపోయిన తర్వాత వలస కార్మికుడి జీవనం ఎలా కొనసాగుతుందని ఆయన ప్రశ్నించారు. అన్ని అడ్డంకులు దాటుకుని స్వగ్రామాలకు చేరిన కార్మికుడికి గ్రామంలో ఉపాధి, ఉద్యోగాలు ఉండవని, ఆదాయం రాదని, ఇలాంటి పరిస్థితుల్లో వారు తమ కుటుంబాలను ఎలా పోషించుకుంటారని చిదంబరం ప్రశ్న లేవనెత్తారు. నేరుగా డబ్బులు ఇస్తేనే కార్మికులకు లాభం ఉంటుందన్నారు.

వర్కింగ్ సిస్టమ్‌పై కొత్త రూల్స్

కసరత్తు చేస్తున్న కేంద్రం

న్యూఢిల్లీ,మే14(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ నేపథ్యంలో .. వర్కింగ్ రూల్స్ మారుతున్న క్రమంలో ఆఫీసులో కూడా వర్క్ సిస్టమ్ మారనుంది. హైదరాబాద్ ఐటి కంపెనీల్లో కూడా భౌతిక దూరం పాటించేలా రూల్స్ రూపొందిస్తున్నారు. ఈ దిశగానే కేంద్ర ప్రభుత్వం కూడా తమ ఉద్యోగుల విషయంలో కొన్ని మార్పులు చేయనున్నది.

ఏడాదిలో 15 రోజుల పాటు వర్క్ ఫ్రమ్ హోమ్‌ను అమలు చేయాలని కేంద్రం భావిస్తున్నది. దీనికి సంబంధించి సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రణాళిక తయారు చేస్తున్నది. సోషల్ డిస్టాన్సింగ్ అమలు చేసేందుకు ఈ ప్రక్రియ తప్పదు అన్నట్లుగా కేంద్రం ఓ ఆలోచనలో ఉన్నది. అన్ని శాఖల్లోనూ ఈ-ఆఫీసులను ఏర్పాటు చేయాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ పేర్కొన్నది. దాదాపు 75 మంత్రిత్వశాఖలు ఇప్పటికే డిజిటల్ ప్లాట్‌ఫాంలో పనిచేస్తున్నాయి. మరో 57 శాఖలు తమ ఆఫీసులను ఈ-ఆఫీసులుగా మార్చే పనిలో నిమగ్నం అయ్యాయి. ఈ మేరకు మార్గదర్శకాలు కూడా రానున్నాయి.

తెలంగాణలో ఆందోళన కలిగిస్తున్న కరోనా

వలసకూలీల రాకతో పెరుగుతున్న పాజిటివ్ కేసులు
నేడు ప్రగతిభవన్‌లో సమీక్షించనున్న సిఎం కెసిఆర్
ఆర్టీసీ, తదితర అంశాలపై చర్చించే ఆస్కారం

హైదరాబాద్,మే14(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా కేసుల పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. దీనికితోడు ఇంతకాలం మర్కజ్ అనుకుంటే ఇప్పుడు వలసకూలీల సమస్య వచ్చిపడిందని మంత్రి ఈటెల అన్నారు. దీనికి తగ్గట్లుగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల్లో కొందరికి పాజిటివ్‌గా తేలింది. మంచిర్యాల, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో కేసులు పెరుగుతున్నాయి. మరోవైపు లాక్‌డౌన్‌ను ఈ నెల 29 వరకు పొడగించిన నేపథ్యంలో తాజా పరిస్థితులపై శుక్రవారం ప్రగతి భవన్‌లో సిఎం కెసిఆర్ మరోసారి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. గతంలోనే ఆయన ఈ విషయం ప్రకటించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నాటి సమావేశానికి ప్రాధాన్యత ఉంది. అలాగే కేంద్రం ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీ లాభనష్టాలను కూడా బేరీజు వేయనున్నారు. ఏయేరంగాలకు లాభమో ఆర్థిక నిపుణులు పరిశీలిస్తున్ఆనరు. శుక్రవారం నాటి సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలను తీసుకోనున్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్‌పై తీసుకున్న పలు నిర్ణయాలపై సుధీర్ఘంగా చర్చించనున్నారు. ఈ నెల 19వ తేదీన దేశంలో సరికొత్త రూపంతో 4.0 లాక్‌డౌన్‌ను అమలు చేస్తామని ప్రధాని నరేంద్రమోడీ వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ కొత్త లాక్‌డౌన్ నిబంధనలు ఎలా ఉండబోతున్నాయి? దాని పరిణావాలు? రాష్ట్ర ప్రయోజనాలకు ఏ మేరకు సహకరిస్తాయన్న అంశాలపై కూడా చర్చించనున్నారు. కరోనా సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం ప్రకటించిన రూ.20 లక్షల ఆర్థిక ప్యాకేజీ, ఎంఎస్ఎంఇలకు ప్రకటించిన రూ.3 లక్షల కోట్ల ప్యాకేజీతో తెలంగాణకు ఏ మేరకు ప్రయోజనం చేకూరనుందన్నది కూడా అధ్యయనం చేస్తున్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీలో వివిధ రంగాలకు చేయూతనిచ్చే అంశాలపై కూడా సిఎం కెసిఆర్ కూలంకషంగా చర్చించనున్నారు. కేంద్రం పరిమిత సంఖ్యలో రైళ్లను నడుపుతుండడం వల్ల తలెత్తున్న సమస్యలు కూడా చర్చించనున్నారు. దీని వల్ల రాష్ట్రంలో కరోనా వైరస్ పెరగడానికి దారితీస్తున్న పరిస్థితులపై కూడా ఈ సమీక్షలో లోతుగా చర్చించనున్నారు. ఇదిలా ఉండగా కేంద్రం ఒకవైపు లాక్‌డౌన్‌ను అమలు చేస్తూనే వివధ రంగాలకు అనేక సండలింపులను ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలో కూడా వివిధ రంగాలకు సడలింపులు ఇవ్వడం? వాటికి సంబంధించిన నిబంధనలపై చర్చించి ఉన్నతస్థాయి సమావేశంలో సిఎం కెసిఆర్ తుది నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. ప్రస్తుతం కరోనా వైరస్ ఇప్పట్లో తగ్గే అవకాశాలు ఏ మాత్రం కనిపించకపోవడంతో ఇక దానితో కలిసి జీవించే అంశాలపై కూడా లోతుగా సమాలోచనలు చేయనున్నారు. కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దాదాపు యాభై రోజులుగా లాక్‌డౌన్‌ను అమలు చేస్తోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్నీ గణనీయంగా కోల్పోయింది. ఈ నేపథ్యంలోనే సిఎం కెసిఆర్ ఈ నెల 5వ తేదీన నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వైన్స్ షాపులు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెరుచుకునేందుకు అవకాశం కల్పించింది. అలాగే ఆర్‌టిఎ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ వంటి శాఖలు కూడా పనిచేస్తాయని సిఎం కెసిఆర్ చెప్పారు. క్రమక్రమంగా రాష్ట్రంలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ తెరుచుకుని, యథావిధిగా విధులను నిర్వహిస్తున్నాయి. ఇదే తరహాల్లో ఆర్‌టిసి బస్సులను నడిపే విషయం లో కూడా సిఎం కెసిఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. రెండు మాసాలుగా పెద్దఎత్తున ఆదాయాన్ని కోల్పోతున్న ఆర్‌టిసిని ఆర్థిక నష్టాల నుంచి గ్టటెక్కించడానికి వీలైనంత త్వరగా బస్సులను నడపాలని భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఈ బసులను నడపడం వల్ల కరోనా వైరస్‌ను ఏ మేరకు నియంత్రించగలమో కూడా అధ్యయనం చేస్తున్నారు. శుక్రవారం జరిగే ఉన్నతస్థాయి సమావేశంలో ఆర్‌టిసి బస్సుల నడపడంపై కీలక నిర్ణయం తీసుకోనున్నారని ఆర్‌టిసిలో పెద్దఎత్తున వినిపిస్తోంది. అలాగే రెడ్‌జోన్లు మినహా మిగిలిన గ్రీన్, ఆరెంజ్ జోన్లలో పలు రంగాలకు మరిన్ని అంక్షలు కూడా ఇవ్వనున్నారని తెలుస్తోంది. వీటితో పాటు సినిమా రంగానికి సంబంధించిన షూటింగ్‌లను కొనసాగించే అంశంపై కూడా చర్చించే అవకాశమున్నట్లుగా తెలుస్తోంది. ఇక జిహెచ్‌ఎంసి పరిధిలోని పలు జిల్లాలో పెరుగుతున్న కరోనా వైరస్ నివారణకు మరిన్ని పకడ్బంది చర్యలు తీసుకోనున్నారు.

రాజధానిలో మరో 472 కరోనా పాజిటివ్ కేసులు

మరణించిన వారి సంఖ్య115కు చేరిక
లాక్‌డౌన్ సడలింపులపై 5 లక్షలకుపైగా సూచనలు
కేంద్రానికి నివేదిస్తామన్న సిఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ,మే14(ఆర్ఎన్ఎ): దేశ రాజధానిలో గత 24 గంటల్లో 472 కరోనా వైరస్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 8470కి చేరింది. గడిచిన 24 గంటల్లో 187 మంది కోలుకుని డిశ్చార్జి అవ్వగా, ఒక్కరు కూడామృతి చెందలేదని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో ఈ ప్రాణాంతక వైరస్ వల్ల ఇప్పటివరకు 115 మంది మృతిచెందారు. మొత్తంగా ఈ వైరస్ బారిన పడిన 3045 మంది బాధితులు కోలకున్నారు. ఇదిలావుంటే భవిష్యత్‌లో లాక్‌డౌన్‌లో ఎలాంటి సడలింపులు ఇవ్వాలనే విషయంపై కొద్ది రోజుల క్రితం ఢిల్లీ ప్రజల నుంచి సూచనలు, సలహాలు కోరినట్లు సీఎం అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు 5 లక్షలకు పైగా సూచనలు, సలహాలు వచ్చాయని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ సూచనలపై లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌తో సమావేశమై చర్చిస్తామన్నారు. ఆ నివేదికను కేంద్రానికి కూడా పంపిస్తామని కేజ్రీవాల్ చెప్పారు. ఢిల్లీ వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలను ఎండా కాలం సెలవులు ముగిసే వరకు మూసివేయాలని మెజార్టీ ప్రజలు అభిప్రాయ పడినట్లు సీఎం తెలిపారు. హోటల్స్‌ను కూడా మూసివేయాలని ప్రజలు కోరినప్పటికీ, టేక్ అవే, హోమ్ డెలివరీకి అనుమతిస్తామన్నారు. హెయిర్ సెలూన్స్, స్పా సెంటర్లు, సినిమా హాల్స్, స్విమ్మింగ్ పూల్స్‌ను తెరవొద్దని ప్రజలందరూ ముక్తకంఠంతో చెప్పినట్లు సీఎం పేర్కొన్నారు. వ్యాపార కార్యకలాపాలకు అనుమతి ఇవ్వాలని మార్కెట్ అసోసియేషన్స్ కోరాయి. అయితే సరి - బేసి విధానంలో మార్కెట్లు తెరిచేలా చర్యలు తీసుకోవాలని సీఎంను కోరారు. ఈ సలహాలు, సూచనలపై పూర్తి స్థాయిలో చర్చించి.. ఢిల్లీలో ఏయే వాటికి సడలింపులు ఇవ్వాలనే అంశంపై లెఫ్టినెంట్ గవర్నర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అరవింద్ కేజ్రివాల్ స్పష్టం చేశారు. ఢిల్లీలో 7,998 కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా, 106 మంది ప్రాణాలు కోల్పోయారు.

కరోనాతో బతకడం నేర్చుకోవాలి

ఇప్పట్లో అది మనలను వీడేలా లేదు
ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

జెనీవా,మే14(ఆర్ఎన్ఎ): నోవెల్ కరోనా వైరస్ ఎక్కడికీ వెళ్లదని, దానితో కలిసి జీవించడం మనుషులుగా మనం నేర్చుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. ప్రపంచ వ్యాప్తంగా కొన్ని దేశాలు స్వల్పంగా లాక్‌డౌన్ ఎత్తివేస్తున్న నేపథ్యంలో డబ్ల్యూహెచ్‌వో ఈ విధంగా స్పంద ఇంచింది. బహుశా కరోనా వైరస్ శాశ్వతంగా అంతం కాదు అన్న సంకేతాన్ని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. ప్రపంచ జనాభాలోకి కొత్తగా వైరస్ ప్రవేశించిందని, అయితే ఎప్పుడు ఆ వైరస్‌ను జయిస్తామన్న విషయాన్ని ఇప్పుడే అంచనా వేయలేమని డబ్ల్యూహెచ్‌వో ఎమ్మర్జ్‌న్సీ డైరక్టర్ మైఖేల్ ర్యాన్ తెలిపారు. ఈ వైరస్ మన జీవితాల్లో భాగస్వామ్యం అవుతుందని, ఇక వైరస్ ఇప్పట్లో వెళ్లే సూచనలు కనిపించడం లేదని ఆయన అన్నారు. జెనీవాలో మీడియాతో మాట్లాడిన ర్యాన్.. హెచ్ఐవీ ఇంకా వెళ్లిపోలేదని, కానీ ఆ వైరస్‌తో జీవించడం నేర్చుకున్నా మన్నారు. కరోనా వైరస్‌తో ఏర్పడిన లాక్‌డౌన్ వల్ల సుమారు సగం ప్రపంచ జనాభా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. లాక్‌డౌన్ ఆంక్షలను ఎత్తివేస్తున్న దేశాలన్నీ జాగ్రత్తగా వ్యవహరించాలని డబ్ల్యూహెచ్‌వో చీఫ్ టెడ్రోస్ తెలిపారు.

రైతులు, వలస కూలీలు, చిన్న వ్యాపారులకు ప్యాకేజీలు



ఢిల్లీ, మే 14: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మీడియా సమావేశం నిర్వహించారు. రెండో ప్రాధాన్యత రంగాలైన 9 విభాగాలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ వివరాలు వెల్లడించారు. ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ రెండో ప్యాకేజీ ప్రకటన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వలస కూలీలు, వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులపై దృష్టి పెట్టాం. సన్నకారు రైతులు, స్వయం ఉపాధి పొందుతున్న వారికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తున్నాం. సన్నకారు రైతులకు తక్కువ వడ్డీ రేటుకే రుణాలు అందిస్తున్నాం. 25 లక్షల మంది కిసాన్ కార్డుదారులకు రూ.25 వేల కోట్ల రుణాలు అందించాం. మార్చి 1వ తేదీ నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు మూడు కోట్ల మంది రైతులకు రూ.86,600 కోట్లు చౌకగా రుణాలు ఇచ్చాం.

సకాలంలో రుణాలు చెల్లించే రైతులకు మే 31వ తేదీ 2021 వరకు వడ్డీ రాయితీ పొడగింపు. వ్యవసాయ రుణాలపై మూడు నెలల వరకు మారిటోరియం.

గిరిజనులకు ఉపాధి అవకాశాలపై, ముద్ర యోజన, హౌసింగ్, ఉద్యోగాల కల్పన అంశాలపై ప్యాకేజీ ప్రకటించాం. గ్రామీణ మౌళిక రంగానికి రూ. 4200 కోట్లు. పట్టణ పేదలు, వలస కూలీలకు అన్నపానీయాల కోసం ఏర్పాట్లు చేశాం. సహాయ శిబిరాలు, భోజన ఏర్పాట్లుకు రూ.11 వేల కోట్లు కేటాయించాం. వలస కార్మికులకు నగదు పంపిణీ జరిగింది. రోజుకు మూడు పూటలు అన్నపానీయాలకు కృషి చేస్తున్నాం. గ్రామీణ బ్యాంకులు, సహాకార బ్యాంకులకు మార్చిలో రూ. 29500 కోట్లు ప్రభుత్వం రీఫైనాన్స్ చేసిందని తెలిపారు.

పట్టణ స్వయం సహాయక సంఘాలకు రూ.12 వేల కోట్లు ఇప్పటికే అందించాం. పైసా పోర్టల్ ద్వారా స్వయం సహాయక సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ అందించాం. వలస కూలీలకు ఉపాధి కోసం మే 13 నాటికి రూ.13 కోట్ల పనిదినాలు కల్పించాం. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు కోసం రాష్ట్రాలకు వర్కింగ్ క్యాపిటల్ కింద రూ. 6700 కోట్లు అందిస్తున్నాం. ఉపాధి హామీ పథకం కింద రూ.10 వేల కోట్లు ఇప్పటికే బట్వాడా జరిగింది. వలస కార్మికులు ఉన్నచోటే కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఉపాధి పొందవచ్చు. కనీస వేతనం 30శాతం మందికే అందుతోంది. దీన్ని సార్వజనీనం చేయాలని నిర్ణయించాం. దేశమంతా ఒకే విధంగా కనీస వేతనం ఉండేలా చూస్తాం. వలస కార్మికులందరికీ ఆరోగ్య పరీక్షలు చేయాలని నిర్ణయించాం. వలస కార్మికులందరినీ ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా తీసుకునేలా వెసులు బాటు కల్పించాం. సంస్థలు, కంపెనీలన్నీ నేరుగా కార్మికులను నియమించుకునే అవకాశం ఉంటుంది. 10 మందికి పైగా ఉపాధి కల్పించే సంస్థలన్నింటికీ ఈఎస్ఐ సౌకర్యం ఉంటుంది. ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్తున్న కార్మికులకు నైపుణ్యం పెంచేలా ప్రత్యేక కార్యక్రమం. ఎన్‌డీఆర్ఎఫ్ కింద రాష్ట్రాలకు రూ.11,0002 కోట్లు ఇప్పటికే అందించాం.

12 వేల స్వయం సహాయక సంఘాలకు 3 కోట్ల మాస్కులు, లక్షా 20 వేల లీటర్ల సానిటైజేషన్ తయారు చేశాయి. రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా ఆహార ధాన్యాల పంపిణీ చేశాం. ఒక్కో వ్యక్తికి 5 కిలోల చొప్పన బియ్యం, గోదుమలు, కిలో పప్పు పంపిణీ చేస్తున్నాం. రేషన్ కార్డులు లేనివారు కూడా బియ్యం, గోధుమలు, పప్పు, తీసుకోవచ్చు. వలస కార్మికులు ఎక్కడన్నా, కార్డు లేకున్నా ఉచితంగా ఆహార ధాన్యాలు పొందవచ్చు. ఉచిత ఆహార ధాన్యాలపంపిణీ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. రేషన్ కార్డు పోర్టబులిటీ తీసుకొచ్చే ప్రయత్నం ఇప్పటికే ప్రారంభించాం. రేషన్ కార్డు ఉన్న వారు దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చు. ఆగస్టు నాటికి ఒకే దేశం... ఒకే కార్డు అమలులోకి తీసుకొస్తాం. ప్రస్తుతం 63 కోట్ల మందికి ఈ కార్డు వెసులుబాటు వస్తుంది. 2021 మార్చి 31 నాటికి వందశాతం రేషన్ కార్డు పోర్టబులిటీ చేస్తాం. ఒకే దేశం ఒకే రేషన్ కార్డు విధానం ప్రజా పంపిణీలో కొత్త విప్లవం తీసుకొస్తుంది. వలస కార్మికులు, పట్టణ పేదల కోసం స్వల్ప అద్దె గృహాల నిర్మాణానికి కొత్త పథకం తీసుకొస్తున్నాం. పట్టణ పేదలు, వలస కూలీలకు అందుబాటులో ఉండేలా పీపీపీ పద్ధతిలో గృహాల నిర్మాణం చేపడతాం. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని చేపడితే తగిన సాయన్ని కేంద్రం అందిస్తుంది. వలస కార్మికుల నివాసానికి ఇబ్బంది లేకుండా నూతన పథకం ఉంటుంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఈ పథకాన్ని తీసుకొస్తాం. భూమి ఉన్నవాళ్లు ముందుకొస్తే తగిన సాయం కోసం కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ముద్ర పథకం కింద రూ.50 వేల లోపు శిశు రుణాలు తీసుకున్న వారికి వడ్డీ రాయితీ. మారిటోరియం అనంతరం ముద్ర రుణాలపై 2 శాతం వడ్డీ రాయితీ అందిస్తామని తెలిపారు.

న్యాయమా? అన్యాయమా?

కరోనా సంక్షోభాన్ని అడ్డంపెట్టుకొని కొన్ని రాష్ట్రాలు కార్మికచట్టాలను కాలరాసేందుకు సిద్ధపడుతున్నాయి. చుట్టుముట్టిన వైరస్, అది సృష్టించిన ఆర్థిక సంక్షోభానికి తోడుగా, ఇకపై ఏ రక్షణలూ లేని స్థితిలో కార్మికులు పనిచేయాల్సిన దుస్థితిని పాలకులు కల్పిస్తున్నారు. ప్రధానంగా బీజేపీ పాలిత రాష్ట్రాలు వరుసపెట్టి కార్మికచట్టాలను నిర్వీర్యం చేయడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. కరోనా దెబ్బకు చైనానుంచి పారిపోతున్న కంపెనీలన్నింటికీ మనం రెడ్ కార్పెట్ పరవాలన్న మోదీ మాటల్లో అంతరార్థాన్ని ఈ రాష్ట్రాల పాలకులు గ్రహించినట్టు ఉంది. దేశీయ కార్మిక చట్టాలన్నింటినీ రద్దుచేసి, చైనా ప్రత్యేకార్థికమండళ్ళలో కార్మికులు చేస్తున్న వెట్టికంటే అధికంగా ఇక్కడి పరిశ్రమల్లో కార్మికులతో గొడ్డుచాకిరీ చేయించేందుకు మార్గం సుగమం చేస్తున్నారు. కార్మికచట్టాల్లో రాష్ట్రాలు చేపట్టిన ఈ సవరణలను కేంద్రం ఆమోదించకూడదని కార్మిక సంఘాలు కోరుతున్నప్పటికీ, అందివచ్చిన ఈ అవకాశాన్ని అది మాత్రం ఎందుకు వదులుకుంటుంది?

ఆర్థిక వ్యవస్థ కుదేలైన నేపథ్యంలో, పెట్టుబడులను ఆకర్షించడం, దేశీయ పరిశ్రమలు వేగంగా కోలుకోవడం లక్ష్యంగా ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాలు అతిముఖ్యమైన కార్మికచట్టాలనుంచి పరిశ్రమలకు తాత్కాలిక మినహాయింపులను ప్రకటించాయి. తాత్కాలికమంటూనే కీలకచట్టాలనుంచి మూడేళ్ళకు పైబడి మినహాయింపులు ప్రకటించిన రాష్ట్రాలు కూడా ఉన్నాయి.

ఉద్యోగులను నియమించుకోవడం, తొలగించడంలో యాజమాన్యాలకు నిరంకుశమైన అధికారాలు దాఖలు పరిచాయి. వారితో 8గంటలే పనిచేయించాలన్న గత నిబంధనల స్థానంలో ఏకంగా పన్నెండుగంటలు చాకిరీ చేయించుకొనేందుకు అనుమతించాయి. తనిఖీలను మరింత కుదించి, నామమాత్రం చేయడం ద్వారా మిగిలిన ఆ నాలుగు చట్టాలు

నేటినిజం
శుక్రవారం 15-5-2020

సవ్యంగా అమలు జరుగుతున్నదీ లేనిదీ కూడా పట్టించుకోబోమని తేల్చేశాయి. కార్మికుల వేతనాలు, ఇతరత్రా ప్రయోజనాలు నిర్ణయించడంలోనూ, కత్తెరవేయడంలోనూ యాజమాన్యాలకు పూర్తిస్వేచ్ఛ దాఖలు పడుతున్నది.

ఉన్న పరిశ్రమలతోపాటు రానున్న పరిశ్రమలకు కూడా వర్తించబోయే ఈ వెసులుబాట్లు తాము ఎంతో కాలంగా కోరుతున్నవీ, ఎదురుచూస్తున్నవేనని పరిశ్రమల సంఘాలు సంతోషిస్తున్నాయి. ఈ దేశంలోకి ఇంతకాలమూ పెట్టుబడులు ప్రవహించకపోవడానికి ఈ బలమైన కార్మికచట్టాలే అడ్డుపడినట్టు, ఇకపై పరిశ్రమలకు, వ్యాపారాలకు ఎన్నడూ లేనంత ఉత్తేజం రాబోతున్నట్టు అవి మాట్లాడుతున్నాయి.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఒకే ఆర్డినెన్సుతో 38 కార్మికచట్టాల్లో మూడు మాత్రమే అమలులో ఉంచి, మిగతావన్నింటినీ మూడేళ్ళపాటు రద్దుచేసింది. పారిశ్రామిక వివాదాలు, ట్రేడ్ యూనియన్, కాంట్రాక్టు ఉద్యోగాలతో వ్యవహరించే చట్టాలన్నీ రాష్ట్రం కత్తెరవేసినవాటిలో ఉన్నాయి. కార్మికులకు నీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించి, పనిప్రదేశాల్లో వారి ఆరోగ్యాన్ని కాపాడాలనీ, భద్రత చూడాలని నిర్దేశిస్తున్న చట్టాలు మధ్యప్రదేశ్‌లో మాయమైనాయి. కొత్తగా పరిశ్రమలు పెట్టబోయేవారు కార్మికుల జీవితాలతో చిత్తంవచ్చినట్టు ఆడుకొనే రీతిలో గుజరాత్ ప్రభుత్వం చాలా సవరణలు చేసింది.

పారిశ్రామిక వివాదాలు, కార్మిక ఒప్పందాల చట్టం వంటివి తొలగిపోవడంతో ఇకపై యాజమాన్యాలు వందమంది ఉద్యోగులను కూడా ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఒకే దెబ్బతో కోట్లాదిమంది కార్మికులు, ఉద్యోగుల భవిష్యత్తును ప్రమాదంలో పడిపోతోందా అనే భయం కలుగుతోంది. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే ప్రక్రియ శరవేగంతో సాగుతున్నది. బహుళజాతి కంపెనీలు సైతం మన దేశానికి వచ్చేసరికి చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్న విషయాన్ని విశాఖ విషవాయు ఘటన తాజాగా తెలియచెప్పింది. పరిశ్రమలు మూతబడి, కోట్లాదిమంది కార్మికులు పొట్టచేత బట్టుకొని స్వగ్రామాలకు తరలిపోతున్న స్థితిలో కార్మికులకు న్యాయం జరుగుతుందా? చైనా దేశంలా అన్యాయమే జరుగుతుందా? అనేది వేచి చూడాల్సిందే...

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా మరో 36 మందికి కరోనా

తాజాగా కర్నూలులో మరొకరు మృతి

అత్యధికంగా నెల్లూరులో 15మందికి పాజిటివ్

అమరావతి,మే14(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా మరో 36 మందికి కరోనా సోకింది. గత 24 గంటలలో రాష్ట్రంలో కొత్తగా 36 కరోనా కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 2100కు చేరింది. కరోనా కారణంగా రాష్ట్రంలో మరొకరు మరణించారు. దీంతో కరోనా మృతుల సంఖ్య 48కి పెరిగింది. కొత్తగా నమోదైన కేసుల్లో అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 15 మందికి కరోనా సోకింది. కరోనా వైరస్ బారిన పడిన వారిలో ఇప్పటివరకు 1192 మంది కోలుకోగా, 860 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయని రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. తాజాగా నమోదైన పాజిటివ్ కేసుల్లో నెల్లూరులో 15, చిత్తూరులో 9, గుంటూరులో 5 ఉండగా, కడప, కృష్ణా, శ్రీకాకుళం జిల్లాల్లో రెండు చొప్పున, పశ్చిమగోదావరిలో మరో కేసు నమోదయ్యాయి. గురువారం మరణించిన వ్యక్తి కర్నూలు జిల్లాకు సంబంధించినవారు. ఈ వైరస్ బారిన పడిన 50 మంది కోలుకుని ఈ రోజు డిశ్చార్జ్ అయ్యారు.

ఆంధ్రప్రదేశ్‌లో నమోదైన కరోనా కేసుల సంఖ్య జిల్లాల వారీగా చూస్తే.. అత్యధికంగా కర్నూలులో 591 కేసులు, గుంటూరులో 404, కృష్ణా 351, చిత్తూరు 151, నెల్లూరు 126, అనంతపురంలో 118, కడప 99, పశ్చిమ గోదావరి 69, విశాఖపట్నం 66, ప్రకాశం 63, తూర్పుగోదావరి 51, శ్రీకాకుళం 7, విజయనగరం 4 కేసులు చొప్పున ఉన్నాయి. ఇకపోతే ప్రకాశం జిల్లాలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య నిలకడగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు 63 మంది కరోనా బారిన పడ్డారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు కరోనా నిర్ధారణ కోసం పంపిన శాంపిళ్లు 18,781గా అందులో నెగెటివ్ ఫలితాలు వచ్చినవి 16,960. అలాగే ఇంకా 1759 రిపోర్టులు రావాల్సి ఉంది. కోయంబేడు మార్కెట్‌కు వెళ్లొచ్చిన వారిని గుర్తించి భారీగా క్వారంటైన్‌కు తరలిస్తున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా క్వారంటైన్లలో 934 మంది ఉన్నారు. అలాగే ఇప్పటి వరకు కరోనా భారి నుండి కోలుకుని 60 మంది డిశ్చార్జ్ కాగా, ముగ్గురు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు.

నిధుల ఖర్చుపై ఆడిటింగ్‌కు ఇదే సమయం: యనమల

అమరావతి,మే14(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేసిన నిధుల వ్యయాన్ని తనిఖీ చేయడానికి ఇదే సరైన సమయమని టీడీపీ నేత యనమల రామకృష్ణుడు అన్నారు. వివిధ నివేదికల ద్వారా నిధుల్లో అవినీతి, దుర్వినియోగం జరిగినట్లు తెలుస్తుందన్నారు. కేంద్రం వేల కోట్లు రాష్ట్రానికి విడుదల చేసిందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సామాన్యులకు ఏమీ చేరలేదు..రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదన్నారు. ఉత్పాదకత లేని కార్యకలాపాల కోసం ఖర్చు చేయడం వల్ల ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటుందన్నారు.

పోలీస్ స్టేషన్ల ముందు రద్దీ

సొంతూళ్లకు వెళ్లే వలస కార్మికుల నమోదు ప్రక్రియ

సీజ్ చేసిన వాహనాలు విడిపించుకుంటున్న ప్రజలు

హైదరాబాద్,మే14(ఆర్ఎన్ఎ): ఎట్టకేలకు వలస కార్మికులను సొంతూర్లకు పంపించే ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి లాక్‌డౌన్ కారణంగా పనులు లేక ఇబ్బందులు పడుతున్న వలస కార్మికులను స్వరాష్ట్రాలకు పంపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే యాక్షన్ ప్లాన్ మొదలు పెట్టింది. నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికుల డేటాను సేకరిస్తూ.. వారిని సొంతూళ్లకు పంపించడానికి రైల్వే సహకారంతో మాస్టర్ ప్లాన్ అమలు చేస్తోంది. ఈ క్రమంలో నగరంలోని ఆయా పోలీస్‌స్టేషన్లలో వలస కార్మికులు పేర్లు నమోదు చేయించుకుంటున్నారు. పోలీసులు నమోదు చేస్తున్న పేర్లకు సంబంధించిన డేటా నేరుగా సచివాలయంలోని ప్రధాన సర్వర్‌కు అనుసంధానం చేయడంతో.. అక్కడి నుంచి ఆయా రాష్ట్రాలకు వెళ్లాల్సిన కార్మికుల ప్రయాణ తేదీలు ఖరారవుతున్నాయి. రైలు ఎప్పుడు ఏ స్టేషన్ నుంచి బయలు దేరుతుంది? అనే సమాచారం కార్మికుడి ఫోన్‌కు మెసేజ్, ఫోన్ కాల్ రూపంలో చేరుతున్నది. వేల మంది వలస కార్మికులు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. అలాగే సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలోనూ కార్మికులు పాసుల కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. ఇదిలావుంటే డీజీపీ ఆదేశాల మేరకు లాక్‌డౌన్ ఉల్లంఘనలతో పట్టుకున్న వాహనాలను అప్పగిస్తున్నారు. లాక్‌డౌన్‌లో సీజ్ అయిన వాహనాలను మూడు కమిషనరేట్ల పోలీసులు రిలీజ్ చేస్తున్నారు. వారం రోజులుగా లక్ష వాహనాలను విడుదల చేశారు. కరోనా కట్టడి, లాక్‌డౌన్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపైకి వచ్చే వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. మార్చి 23 నుంచి లాక్‌డౌన్ ప్రారంభం కాగా.. నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడం లేదా ఇతరత్రా కారణాలు చూపి ప్రతి రోజూ వందల సంఖ్యలో వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపైకి వచ్చారు. దీంతో పోలీసులు వారిపై పెట్టీ కేసులు నమోదు చేసి.. వాహనాలను సీజ్ చేసి, చలానాలు కూడా విధించారు. ఈ క్రమంలోనే పోలీస్‌స్టేషన్ల వద్ద సీజ్ చేసిన వాహనాలకు పార్కింగ్ స్థలం సరిపోకపోవడంతో పలు ఠాణాల అధికారులు ఆయా ఠాణాల పరిధిలో ఉండే ఫంక్షన్‌హాల్స్, గ్రౌండ్స్‌ను పార్కింగ్ కోసం ఉపయోగించారు. సీజ్ అయిన వాహనాల సంఖ్య రోజు రోజుకు పేరుకుపోతుండడంతో.. యజమాని నుంచి లిఖిత పూర్వంగా బాండ్ రాయించుకొని, కోర్టు ఆదేశాలతో జరిమానాలు చెల్లించిన వాహనాలను విడుదల చేశారు. అయితే కొందరు వాహన యజమానులు రాకపోవడంతో ఆ వాహనాలు పోలీసుల ఆధీనంలోనే ఉన్నాయి.

పన్నుల వసూళ్లు తప్పనిసరి

మెదక్,మే14(నేటినిజం ప్రతినిధి): ఈ నెలాఖరు లోపు జిల్లాలోని మున్సిపాలిటీల్లో పన్ను వసూళ్లు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ధర్మారెడ్డి ఆదేశించారు. మున్సిపాలిటీల్లో ఆర్థిక సమస్యలు తీరాలన్నా, పనులు జరగాలన్నా పన్నుల వసూళు తప్పనిరని అన్నారు. పన్నులను వసూలు చేస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. కరోనా నియంత్రణకు దుకాణాల వద్ద శానిటైజర్లను ఏర్పాటు చేయించి, ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఏకసభ్య ధర్మాసనాలతో 20 కేసుల్లో తీర్పులు

న్యూఢిల్లీ,మే14(ఆర్ఎన్ఎ): సుప్రీంకోర్టులో తొలిసారి మూడు ఏకసభ్య ధర్మాసనాలు ఒకేరోజు 20 చొప్పున కేసులను విచారించి తీర్పులిచ్చాయి. బుధవారం జస్టిస్ కృష్ణ మురారి, జస్టిస్ రవింద్ర భట్, జస్టిస్ హృషికేశ్ రాయ్‌లు వేర్వేరుగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ విచారణలు జరిపారు. ఒక్కొక్కరు సుమారు 20 ట్రాన్స్‌ఫర్ పిటిషన్లను విచారించి, తదనుగుణంగా ఉత్తర్వులిచ్చారు. కేసుల భారాన్ని తగ్గించుకునేందుకు గత సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు రూల్స్ బుక్‌లోని పలు నిబంధనలను మార్చింది. ఏడేళ్లలోపు శిక్ష పడే నేరాలకు సంబంధించిన ముందస్తు బెయిల్ కేసులను ఏకసభ్య ధర్మాసనాలు విచారించవచ్చని పేర్కొంది.

పులిమీద పుట్రలా విద్యుత్ బిల్లులు

హైదరాబాద్,మే 14:పులిమీద పుట్రలా ఇప్పుడు విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నాయి. కేంద్రం ఓ వైపు విద్యుత్ బిల్లును తీసుకుని రాబోతున్న తరుణంలో తెలుగు రాష్ట్రాల్లో బిల్లులు బుసకొడుతున్నాయి. ఎపిలో విద్యుత్ ఛార్జీలు పెంచితే...తెలంగాణలో పెంచబోతున్నారు. దీనికితోడు తెలంగాణలో గతేడాది బిల్లుల ఆధారంగా ఒక్కో ఇంటికి ఆన్‌లైన్‌లో బిల్లులు పంపడంతో ప్రజలు గుభిల్లుమంటున్నారు. లాక్‌డౌన్ పీరియడ్‌లో ఇంటికే పరిమితమైన కొందరికి అప్పుడే బిల్లుల వాయించడంతో ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కొందరు తాము ఇళ్లు కార్యాలయాల మూసేసుకున్నా వేలల్లో బిల్లులు వచ్చాయని వాపోతున్నారు. ఉచిత విద్యుత్ పొందుతున్న రైతులకు కూడా కేంద్ర విద్యుత్ బిల్లుతో పిడుగు పడనుంది. ప్రజలను ఆదుకుంటామని ఓ వైపు ప్రకటనలు గుప్పిస్తున్న తెలుగు వల్లభులు ప్రజలకు కరెంట్ షాక్ ఇవ్వడం చూస్తుంటే వారి ప్రేమ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. దీనికితోడు కేంద్రం విద్యుత రంగాన్ని కబళించాలని చూస్తోంది. దీంతో రాష్ట్రాలకు పిడుగుపాటు కానుంది. ఉచిత విద్యుత్ పొందుతున్న రైతులకు కూడా అశనిపాతం కానుంది. కేంద్రం తన పరిధిలోకి ఈ రంగాన్ని తీసుకున్నాక బిల్లుల పరిస్తితి ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేం. అయితే ఈ లోగానే విద్యుత్ ఛార్జీలు పెంచడం, ఇష్టారీతిన బిల్లులతో చిల్లులు పెట్టడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వాలు ఆలోచించాలి.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందుతుందున్నా, ఇష్టారీతిన బిల్లులు రావడంతో ప్రజలు జీర్ణించుకోవడం లేదు. తెలంగాణలో గత ఐదారేళ్లుగా నరంతర విద్యుత్ అందడంతో ప్రజలు బిల్లులను పెద్దగా లెక్కించడం లేదు. మరోవైపు విద్యుత్ ఛార్జీలు పెంచు తామని సిఎం కెసిఆర్ ఇప్పటికే ప్రకటించారు. ప్రస్తుత బిల్లుల మొత్తాన్ని చూస్తుంటే ఇకముందు బిల్లుల షాక్ ఇవ్వక తప్పకపోవచ్చు. అలాగే ఎపిలోనూ విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయంపై ప్రజలు ఆందోళన చెందు తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం ప్రతి యూనిట్‌కు 7 రూపాయలు ఖర్చు అవసరం అవుతోంది. ప్రతి యూనిట్‌కు అయిన ఖర్చును ప్రతి వినియోగదారుడి నుంచి రాబట్టాలనుకుంటే అల్పాదాయ వర్గాలు ఇబ్బంది పడే అవకాశముంది. అందుకే ఈ వర్గాల నుంచి తక్కువ ఛార్జీని నిర్ణయించి వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం గృహ రంగంలో నెలకు 50 యూనిట్లు విద్యుత్ వాడుకుంటున్న వినియోగదారులకు నిర్ణయించిన యూనిట్ ఛార్జీ కేవలం రూ.1.45 పైసలు. అంటే యూనిట్‌కు సుమారు రూ.5.50 పైసల ఆదాయం ఈ వర్గాల నుంచి తగ్గుతోంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ, పరిశ్రమలకు ఎక్కువ ఛార్జీని నిర్ణయించిన కారణంగా వచ్చే ఆదాయం రూపంలో విద్యుత్ పంపిణీ సంస్థలు పొందుతున్నాయి. తెలంగాణలో వ్యవసా యానికి కూడా 24 గంటల ఉచిత విద్యుత్ అమలవుతోంది. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు లేవు. రైతు ఎంత విద్యుత్ వాడుకునే విషయం తెలియాలంటే వీటికి మీటర్లు బిగించాల్సిందే. మొత్తం విద్యుత్ వినియోగంలో 30 శాతం మేర వ్యవసాయ రంగమే ఉంటోంది. కేంద్రం ప్రతిపాదించిన బిల్లు ప్రకారం ఈ పద్ధతికి స్వస్తి చెప్పాల్సిందే. ఒక యూనిట్ సరఫరాకు అయిన ఖర్చును పరిగణనలోకి తీసుకొని ఈఆర్‌సీ నిర్ణయించిన ఛార్జీని ప్రతి వినియోగదారుడూ ముందు చెల్లించాలి. ప్రభుత్వం కావాలనుకుంటే రాయితీని వినియోగదారుడికి తరువాత అందించాల్సి ఉంటుంది. అంటే గ్యాస్ సబ్సిడీ లాగా విద్యుత్ సబ్సిడీని రాష్ట్రాలు భరించాల్సి ఉంటుంది. నిత్యం వాడుకునే విద్యుత్‌కు ప్రతి నెలా వందల్లో ఛార్జీ చెల్లించాల్సి వస్తుంది. ఎంత విద్యుత్ వాడుకున్న వారికి రాయితీ ఇవ్వాలి? సొమ్ము రూపంలో ఇవ్వాలా? లేక ప్రతి నెలా కొన్ని యూనిట్లను పరిగణనలోకి తీసుకొని రాయితీ ఇవ్వాలా? ఇళ్లు అద్దెకు ఇచ్చే వారికి మూడు నాలుగు విద్యుత్ కనెక్షన్లు ఉంటాయి. అపుడు వారికి కూడా ఇవ్వాలా? అన్న సమస్యలు వస్తాయి. నిజానికి ఎన్ని సంస్కరణలు తెచ్చినా విద్యుత్ రంగం సంక్షోభం నుంచి బయటపడడంలేదు. ఇలాంటి స్థితి నుంచి బయట పడేయడానికి కేంద్రం ఎప్పటికప్పుడు సంస్కరణల పేరిట మార్పులు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. రాష్ట్రాల అధికారాలను తన గుప్పిట్లో పెట్టుకునేందుకు యత్నిస్తోంది. బలవంతంగా నిబంధనలను రుద్దే ప్రయత్నం చేస్తోంది. కేంద్రం తీసుకుని రాబోయే చట్టం ప్రకారం రైతులే విద్యుత్ బిల్లులను చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఉచితంగా ఇవ్వాల్సి వస్తే రైతులు చెల్లించాల్సిన మొత్తం బిల్లులను ప్రభుత్వాలు చెల్లించుకోవాల్సి ఉంటుంది. విద్యుత్ రంగం ఆర్థికంగా పరిపుష్టంగా ఉంటే తప్ప ఈ రంగం మనుగడ సాధ్యం కాదు. అయితే కేంద్రం తీసుకుని రాబోతున్న విద్యుత్ బిల్లు వల్ల సమాజంలోని అల్పాదాయ వర్గాలు ముఖ్యంగా రైతులకు గొడ్డలిపెట్టు కానుంది. పంపుసెట్ల మీద ఆధారపడే రైతులు వ్యవసాయం చేయడం కూడా కష్టం కానుంది. ఆయా వర్గాలు కొత్తంగా వచ్చే ఛార్జీల భారం మోయడం కష్టమే. అదలావుంచితే తాజాగా విద్యుత్ ఛార్జీల భారం మోపడం ద్వారా ప్రభుత్వాలు ప్రజలకు ముందే షాక్ ఇస్తున్నాయి. లాక్‌డౌన్ వేళ ఆదాయం లేకుండా ఇంటికే పరిమితం అయిన ప్రజలపై భారం మోపడం సరికాదు. తెలంగాణలో వచ్చిన బిల్లులను సమీక్షించాల్సి ఉంది. లేకుంటే ప్రజలపై తీవ్ర భారం కానుంది. ఎలాగూ కేంద్రం బిల్లు తీసుకుని రాబోతున్న తరుణంలో ఇప్పుడే బిల్లులు పెంచే ఆలోచనను మానుకోవాలి. ప్రజలకు కొంతయినా ఊరడింపు కలుగుతుంది.

టిడిఎస్ పన్ను చెల్లింపుదారులకు ఊరట స్వల్పమే

పెద్దగా లాభం లేదంటున్న నిపుణులు

న్యూఢిల్లీ,మే14(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ మహమ్మారి విరుచుకుపడిన పర్యవసానంగా ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు తలకిందులయ్యాయి. లాక్‌డౌన్ విధింపులు తప్పనిసరి కావడంతో అన్నీ స్తంభించిపోయాయి. వాణిజ్యం తీవ్రంగా దెబ్బతింది. ఉపాధి కోల్పోవడం వల్ల చాలామందికి పూట గడవటం ప్రశ్నార్థకంగా మారింది.

కనుక వినిమయం దారుణంగా పడిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో వృద్ధికి ఊతం ఇవ్వడమే ధ్యేయంగా, స్వావలంబన సాధించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని తన ప్రకటనకు ముందు నిర్మలా సీతారామన్ చెప్పారు. కనుక ఆమె ప్రకటించిన తొలి విడత చర్యలు ఈ దిశగా వుంటాయని సహజంగానే ఆశిస్తారు. టీడీఎస్,టీసీఎస్ తగ్గింపు మూలాన వీరి పన్ను చెల్లింపులో మాత్రం తగ్గింపు ఉండదని నిపుణులు చెప్తున్నారు.

ఐటీ శ్లాబులను అనుసరించి వీరు మొత్తం ఆదాయంపై పన్ను చెల్లించాల్సి ఉంటుందంటున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన మేరకు వీరికి తాత్కాలికంగా ఉపశమనమే తప్ప ఎలాంటి ప్రయోజనమూ ఉండదని అంటున్నారు. అయితే వడ్డీ, డివిడెండ్, అద్దె వంటి వేతనేతర చెల్లింపులకు సంబంధించి టీడీఎస్/టీసీఎస్‌ను కేంద్ర ప్రభుత్వం 25 శాతం మేర తగ్గించింది. దీని ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్‌దారులు, మ్యూచువల్ ఫండ్‌లు, షేర్ల ద్వారా డివిడెండ్ పొందేవారు, అద్దెల ద్వారా ఆదాయం పొందే యజమానుల చేతుల్లో లిక్విడిటీ పెరుగనుంది. అంటే, టీడీఎస్ తగ్గింపు ద్వారా పొందిన మొత్తాన్ని తిరిగి సెల్ఫ్ అసెస్‌మెంట్ ట్యాక్స్ రూపంలో చెల్లించాల్సి వస్తుంది. ఒకవేళ స్వీయ అంచనా పన్ను నిర్దిష్ట పరిమితి దాటితే, అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించవలసి ఉంటుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై చెల్లించే రూ.50,000 వడ్డీకి బ్యాంక్ 10 శాతం టీడీఎస్ కింద రూ.5000 డిడక్ట్ చేస్తే.. రేట్ల తగ్గింపు వల్ల టీడీఎస్ 7.5 శాతానికి తగ్గుతుంది. దీంతో డిడక్ట్‌చేసే మొత్తం 3,750కి తగ్గుతుంది. దీని వల్ల చేతిలోకి అధిక మొత్తం వస్తుంది. టీడీఎస్ తర్వాత వచ్చే వడ్డీ ఆదాయం రూ.46,250. అయితే దీని వల్ల వడ్డీ ఆదాయంపై చెల్లించే టాక్స్‌లో మాత్రం మార్పుండదు.

పైగా అధిక పన్ను చెల్లించాల్సి రావచ్చు. మీరు 30 శాతం పన్ను శ్లాబులో ఉన్నారనుకుంటే, 10 శాతం టీడీఎస్ పోను 20 శాతం చెల్లించాల్సి ఉంటుంది. అయితే టీడీఎస్ రేటు తగ్గడం వల్ల స్వీయ అంచనా పన్ను చెల్లించే సమయంలో 22.5 శాతం పన్ను చెల్లించాల్సి వస్తుంది.

కేంద్రం ఆలోచనల మేరకు బ్యాంకులు సహకరించేనా?

నేరుగా సాయం చేస్తేనే మేలు అంటున్న ప్రముఖులు

న్యూఢిల్లీ,మే14(ఆర్ఎన్ఎ): ఇప్పుడున్న విపత్కర పరిస్థితుల్ని అధిగమించాలంటే చిత్తశుద్ధితో కేంద్రం ప్రయత్నం చేయడం తప్ప వేరే మార్గం లేదని నిపుణులు అంటున్నారు. కేంద్రం ప్రకటించిన విధంగా బ్యాంకుల నుంచి హామీలు రావాలని కోరుకుంటున్నారు. లేదా నేరుగా ప్రజలకు సాయం అందాలని అంటున్నారు. అలాకాని పక్షంలో కేంద్రం ఎన్ని ప్రకటనలు చేసినా లాభం లేదంటున్నారు. భారీ అంకెలు చూపడానికి అన్నిటినీ గుదిగుచ్చిన వైనం కళ్లకు కడుతోంది. ముమ్మందు ప్రకటించే ప్యాకేజీలైనా మెరుగ్గా రూపొందిస్తే ఈ పెను విపత్తునుంచి అందరూ క్షేమంగా బయట పడేందుకు వీలవుతుందని సూచిస్తున్నారు.

దేశంలో దాదాపు 70 లక్షల ఎంఎస్ఎంఈలున్నాయి. ఇందులో వంద కోట్ల టర్నోవర్ దాటిన యూనిట్లు 45 లక్షల వరకూ వుంటాయి. వీటికి ఏ హామీ చూపకుండా నేరుగా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే సౌలభ్యం కలిగించారు. ఇందుకోసం రూ. 3 లక్షల కోట్లు కేటాయించారు. అలాగే ఎంఎస్ఎంఈల పరిధిలోకి రావడానికి ఉన్న పరిమితుల్ని కూడా పెంచింది. ఈ చర్య వల్ల దేశంలోని అనేక సంస్థలు లబ్ధిపొందుతాయని సర్కారు అంచనా. ఈ రుణాన్ని నాలుగేళ్ల వ్యవధిలో చెల్లించేందుకు, తొలి ఏడాది అసలు, వడ్డీ చెల్లింపులపై మినహాయింపు ఇచ్చేట్టు వెసులుబాటు ఇచ్చారు. ఈ ఆసరాతో వ్యాపార కార్యకలాపాలు పెరగడంతోపాటు లక్షలాదిమందికి ఉపాధి భద్రత ఏర్పడుతుందని కేంద్రం భావిస్తోంది. తన వంతుగా ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వ రంగ సంస్థలనుంచి రావాల్సిన అన్ని రకాల బకాయిలను చెల్లిస్తామని ప్రకటించింది. బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం కల్పించడం తప్ప కేంద్రం ఇందులో తనకు తాను ఇస్తున్నదేమీ లేదు. అయితే మన బ్యాంకులు ప్రభుత్వం ఆశించినట్లు చేస్తాయా అన్నది చూడాలి. కొన్నిసార్లు రిజర్వ్ బ్యాంక్ చెప్పినా వినవు. రిజర్వ్‌బ్యాంక్ 3 నెలలపాటు ఈఎంఐల చెల్లింపుపై మారటోరియం విధిస్తే అది ఆచరణకొచ్చేసరికి ఏమైందో అందరికీ అనుభవమైంది. ఎంఎస్ఎంఈల విషయంలోనూ అంతకంటే మెరుగ్గా ఏమీ వుండదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఎలాంటి హామీ లేకుండా రుణాలిస్తే తాము ఇరుక్కుంటా మన్న భయం బ్యాంకులకు ఉంటుంది. వాటికి ఆర్‌బీఐ నిబంధనలు గుర్తొస్తాయి. చివరకు ఎంఎస్ఎంఈ యజమానులకు ప్రయాస తప్ప ఫలితం కనబడదంటున్నారు. దానికి బదులు ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసి దాని ద్వారా కేంద్రమే నేరుగా రుణవితరణ చేయడం లేదా రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయంతో దీన్ని అమలు చేయడం వంటి ఆలోచనలు చేస్తే బాగుంటుందని అంటున్నారు. తమకు అవసరమైన పెట్టుబడి మరోవిధంగా వచ్చే అవకాశం లేదు గనుక ఈ విషయంలో వాటి యజమానులు జాగ్రత్తగా వుంటారు. కేవలం బడా పారిశ్రామిక వేత్తలకూ, బడా వ్యాపారులకూ మాత్రమే ఎగ్గొట్టే ఉద్దేశంతో రుణాలు తీసుకునే సంస్కృతి వుంది. కనుక ఎంఎస్ఎంఈలకు నేరుగా రుణ సదుపాయం కల్పించడంలో జంకవలసిన పనిలేదు. లాక్‌డౌన్ కారణంగా దెబ్బతినివున్న ఎంఎస్ఎంఈలకు లిక్విడిటీ పరంగా వూతం అందించడమే ఈ చర్యలన్నిటి ఉద్దేశం. ఈ దిశగా కేంద్రం కూడా ఆలోచన చేసివుంటే బాగుండేది. రైల్వేలు, రోడ్డు రవాణా, జాతీయ రహదారులు తదితర సంస్థల్లోని కాంట్రాక్టర్లు పనులు పూర్తిచేయాల్సిన పరిమితిని ఆర్నెల్లు పొడిగించారు. ఇందువల్ల వారికి పెనాల్టీ బెడద వుండదు. ఈ సదుపాయం రాష్ట్ర ప్రభుత్వాలకు పనిచేసే కాంట్రాక్టర్లకు వర్తింపజేయాలన్న స్పృహ లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

కేర్ ఆస్పత్రి తరపున సైబరాబాద్ సిపి సజ్జనార్‌కు మాస్కులు,శానిటైజర్లు అందచేసిన ప్రతినిధులు

సింపుల్‌గా పెళ్లి చేసుకున్న నటుడు నిఖిల్

హైదరాబాద్,మే14(ఆర్ఎన్ఎ): యంగ్ హీరో నిఖిల్ వివాహం నిరాడంబరంగా పరిమిత కుటుంబ సభ్యుల మధ్య జరిగింది. అంగరంగ వైభవంగా పెళ్లి చేసుకోవాలని భావించారు. అయితే ఆయన ఆశలనీ కరోనా ఆవిరి చేసింది. కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో చాలా సింపుల్ గా నిఖిల్ పెళ్లి చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో డాక్టర్ పల్లవి వర్మని.. నిఖిల్ వివాహమాడాడు. శామీర్‌పేట్‌లోని ఓ ప్రైవేట్ గెస్ట్ హౌస్‌లో ఈ పెళ్లి వేడుక జరిగింది. హిందూ సంప్రదాయం ప్రకారం శాస్త్రోక్తంగా పెళ్లి జరిగింది. సరిగ్గా ఉదయం 6.30 నిమిషాలకు ఈ జంట ఒక్కటయ్యింది. నిజానికి నిఖిల్ పెళ్లి ఏప్రిల్ 16న జరగాల్సి ఉంది. అయితే కరోనా మహమ్మారి పుణ్యమా అని ఆ పెళ్లిని వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. అయితే మే 14న వీరిద్దరి పెళ్లి చేయాలని పెద్దలు నిశ్చయించారు. అతికొద్ది మంది అతిథుల మధ్య నిఖిల్ పెళ్లి చాలా సింపుల్‌గా జరిపోయింది. అయితే కరోనా ప్రభావం తగ్గాక.. పెళ్లి రిసెప్షన్ ని గ్రాండ్ గా నిర్వహించబోతున్నట్టు సమాచారం.

కోయంబేడ్ కార్మికులకు కరోనా టెస్టులు

-2600 మందికి పాజిటివ్ నమోదు

చెన్నై,మే14(ఆర్ఎన్ఎ): తమిళనాడు రాజధాని చెన్నై నగరంలోని కోయంబేడు మార్కెట్ కరోనా వైరస్ హాట్‌స్పాట్‌గా మారింది. తమిళనాడు వ్యాప్తంగా 9,227 కరోనా పాజిటివ్ కేసులు నమోదైతే.. కేవలం కోయంబేడు మార్కెట్‌లోనే 2,600 కేసులు నమోదైనట్లు ప్రత్యేక నోడల్ అధికారి తెలిపారు. కోయంబేడు మార్కెట్‌లో పని చేస్తున్న కార్మికులందరికీ కరోనా పరీక్షలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. అందులో 2,600 మందికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. వీరితో కాంటాక్ట్ అయిన వారిని గుర్తిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటికే 2.6 లక్షల మందికి కరోనా పరీక్షలు నిర్వహించామన్నారు. ఇక గడిచిన 24 గంటల్లో తమిళనాడులో కొత్తగా 509 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. ఇప్పటి వరకు తమిళనాడులో కరోనాతో 64 మంది ప్రాణాలు కోల్పోయారు.

అర్బన్ స్లమ్స్ ఏరియాల్లో కరోనాను నివారించడం పెద్ద సవాలే అని నోడల్ ఆఫీసర్ చెప్పారు. ప్రజలందరూ భౌతిక దూరం పాటిస్తూ.. ముఖానికి మాస్కు ధరిస్తే కరోనాను కట్టడి చేయొచ్చు అని ఆయన తెలిపారు. నిరంతరం చేతులను పరిశుభ్రంగా ఉంచుకుంటే సరిపోతుందన్నారు.

కరోనా రహిత జిల్లాగా కోవై

పాజిటివ్ వచ్చిన వారంతా సేఫ్

అధికారులను అభినందించిన కలెక్టర్

చెన్నై,మే14(ఆర్ఎన్ఎ): ఓ వైపు కరోనాతో తమిళనాడు అతలాకుతలం అవుతుండగా కోయంబత్తూరు జిల్లా కరోనా రహిత జిల్లాగా మారింది. వైరస్‌తో చికిత్స పొందుతున్న ఆఖరి రోగి డిఛార్జ్ అయినట్లు అధికారులు తెలిపారు.

కోయంబత్తూరు జిల్లాలో 146 మంది కరోనా పాజిటివ్ లక్షణాలతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. వీరిలో 141 మంది సంపూర్ణంగా కోలుకుని డిఛార్జ్ అయ్యారు.

ఈ నెల మూడున కరోనా సోకి చికిత్స పొందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పూర్తిగా కోలుకుని డిఛార్జ్ అయ్యారు. ఈ నేపథ్యంలో

కోయంబత్తూరు కరుంబుకడై ప్రాంతానికి చెందిన 31 యేళ్ళ గర్భిణి కొవిడ్ సోకి ఈఎస్ఐ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. గత వారం ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది.

బిడ్డకు కరోనా సోకలేదని వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. ఆమె కూడా సంపూర్ణంగా కోలుకుని బుధవారం డిఛార్జ్ అయ్యింది. ఈ వివరాలను జిల్లా కలెక్టర్ రాజామణి ప్రకటిస్తూ ప్రస్తుతం కోవై జిల్లా కరోనా రహిత జిల్లా మారిందని పేర్కొన్నారు. దీంతో అధికారులను కలెక్టర్ అభినందించారు.

విద్యుత్ ఛార్జీలు చెల్లించాల్సిందే

-పెంచిన ఛార్జీలు తగ్గించాలని టిడిపి డిమాండ్

విజయవాడ,మే14(ఆర్ఎన్ఎ): విద్యుత్తు వినియోగదారులు మార్చి, ఏప్రిల్ నెలకు సంబంధించి బిల్లులను 30లోపు బిల్లులు చెల్లించాలని ట్రాన్స్‌కో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు ఛార్జీలు పెంచలేదని, ఒకేమారు రెండునెలల రీడింగ్ తీయడంతో అధికంగా బిల్లులు వస్తున్నట్లు చెప్పారు. వినియోగించిన యూనిట్లను రెండునెలల వారీగా విభజించి బిల్లింగ్ చేశామన్నారు. 500 యూనిట్లు దాటిన వినియోగదారులకు మాత్రమే 90పైసలు పెంచడం జరిగిందని గుర్తుచేశారు. అయితే లాక్‌డౌన్ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ప్రజలపై విద్యుత్ ఛార్జీల మోత తగదని టిడిపి నేతలు అన్నారు. అన్నారు. కరోనా కాలంలో విద్యుత్ టారిఫ్‌లను పెంచడం దారుణమన్నారు. ప్రజల సంక్షేమాన్ని ఆలోచించి ప్రభుత్వం తక్షణమే విద్యుత్ బిల్లులను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు విద్యుత్ బిల్లు రూపంలో షాక్ ఇస్తూ పెనుభారం మోపడం భావ్యం కాదని తెలిపారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఈ మేరకు విద్యుత్ అధికారులను కోరారు. రెండునెలల బిల్లులను ఒక సారి రీడింగ్ తీయడం వల్ల స్లాబ్ రేటు అమాంతం పెరిగిపోయి ప్రజలకు పెనుభారంగా మారిందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో తెల్ల రేషన్ కార్డుదారుల బిల్లులను మాఫీ చేయాలని కోరారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లులు ప్రజలకు షాక్ ఇస్తున్నాయన్నారు. ప్రతి ఇంటికి రూ.100 నుంచి రూ. 500 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని విమర్శించారు. పెంచిన చార్జీలు తగ్గించకుంటే నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కరోనా కాలంలో విద్యుత్ ఛార్జీలు పెంచడం దారుణమని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లాక్‌డౌన్‌తో ఆర్థికంగా చితికిపోయిన ప్రజలపై భారం మోపడం తగదన్నారు. వెంటనే విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు.

త్వరితగతిన మిల్లులకు ధాన్యం తరలింపు

కొనసాగుతున్న ఉచిత బియ్యం పంపిణీ

పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్,మే14(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో యాసంగిలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మంగళవారం నాటికి రైతుల ఖాతాలో రూ. 4,006 కోట్లను జమ చేశామని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని, ఎక్కడా ఇబ్బందులు లేవని వివరించారు. ఇప్పటి వరకు 6341 కొనుగోలు కేంద్రాల ద్వారా 7.10 లక్షల మంది రైతుల నుంచి రూ. 7,404 కోట్ల విలువైన 40.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇందులో 38.44 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి రైసు మిల్లులకు తరలించడం జరిగిందని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఒక్కరోజే రూ. 290 కోట్లను విడుదల చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కొన్ని జిల్లాల్లో అకాల వర్షాలు పడుతున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా త్వరితగతిన రైసు మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 1వ తేదీ నుంచి 13వ తేదీ వరకు 87.55 లక్షల కుటుంబాలకుగాను బుధవారం నాటికి 72.73 లక్షల మంది కార్డుదారులకు 2 లక్ష 72 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని, 2,488 మెట్రిక్ టన్నుల కందిపప్పును పంపిణీ చేయడం జరిగిందని మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

విద్యుత్ కేంద్రం చేతుల్లోకి వెళితే అంతే సంగతులు

రైతులకు తీరని భారం తప్పదు

ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసియేషన్ ఆందోళన

హైదరాబాద్,మే14(ఆర్ఎన్ఎ): కేంద్ర విద్యుత్ సవరణ ముసాయిదా బిల్లు ఆమోదం పొందితే రాష్ట్ర ప్రభుత్వాలు అణగారిన వర్గాలకు ఇస్తున్న సబ్సిడీ రద్దు అయ్యే అవకాశం ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా యాదగిరి ఆందోళన వ్యక్తం చేశారు. సబ్సిడీతో వచ్చి వ్యవసాయ,గృహ విద్యుత్ సరఫరా ప్రమాదంలో పడనుందన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇటువంటి తొందర పాటు నిర్ణయాలతో బడుగుబలహీన సామాజిక వర్గాల వినియోగ దారులపై ఆర్థిక భారం పడే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం డిస్కంలను ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేస్తుందన్నారు. దీంతో ఉచిత రాయితీలకు దెబ్బపడే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు ధైర్యంగా వ్యవసాయం చేసుకుంటున్నారని, కాని నూతన కేంద్ర విద్యుత్ బిల్లుతో రైతుల ఆత్మహత్యలు పెరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు పాలిట శాపంగా మారుతుందన్నారు. గత 7 సంవత్సరాలుగా రాష్ట్రంలో ఎటువంటి విద్యుత్ కోతలు , విద్యుత్‌షాక్‌లు లేవని, అంతే కాకుండా రైతులు మీటర్ల కాలిపోతాయన్న భయం లేదన్నారు. అంతే కాకుండా రైతుల ఆత్మహత్యలు కూడా చేసుకోలేదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. నూతన ముసాయిదాతో వ్యవసాయ రంగానికి చార్జీలు వసూలు చేయడం జరుగుతుందన్నారు.

మన రాష్ట్రంలో సుమారు 24.4 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, వీటికి మీటర్లు బిగించేందుకు ఒక్కొక్క కనెక్షన్‌కు సుమారు 1500 నుంచి 2వేలు అవుతుందని దీంతో రూ.425 కోట్లు డిస్కం మీద భారం పడుతుందన్నారు. డిస్కంలు ఆయా భారాన్ని రైతుల నుంచి వసూలు చేసే అవకాశం ఉందన్నారు. అంతే కాకుండా కరెంట్ బిల్లులు 5 హెచ్‌పి మోటార్‌కు ప్రతి 8 నెలకు రూ.43 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అంతే కాకుండా వ్యాప్త పరిశ్రమలకు నుంచి వసూలు చేసే మొత్తాన్ని గృహ వినియోగదారులకు మళ్లిస్తుందని దీన్ని క్రాస్ సబ్సిడీ అంటారని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు బెనర్జీ ,గోవర్ధన్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

బయోడీజిల్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

-ఇద్దరు కార్మికుల దుర్మరణం

సంగారెడ్డి,మే14(ఆర్ఎన్ఎ): జిల్లాలోని జహీరాబాద్ మండలం అర్జున్ నాయక్ తండా వద్ద ఉన్న స్పందన బయోడీజిల్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు పరిశ్రమలో రియాక్టర్ పేలి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతిచెందగా.. మరికొంతమందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో గాయపడినవారిని చికిత్స కోసం వెంటనే ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మరోఘటనలో రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని మేకగూడ శివారులో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. బిస్కెట్ పరిశ్రమలో గ్యాస్ లీకై పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. స్థానికులు సమాచారంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శంషాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఈ అగ్నిప్రమాదంలో ఎంత ఆస్తినష్టం జరిగిందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని పోలీసులు తెలిపారు. మరోవైపు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అర్జున్ నాయక్ తాండాలోని భాండా ఫ్యూయల్ కంపెనీలో భారీ ప్రమాదం జరిగింది. రియాక్టర్ పేలడంతో పలువురు మృతి చెందారు. ఈ సంఘటనలో మృతి చెందిన ఇరు కుటుంబాలకు 15 లక్షల రూపాయల చొప్పున పరిహారం చెల్లించడానికి కంపెనీ యాజమాన్యం ఒప్పుకుంది. మృతుల కుటుంబాలకు పరిహారం అందేలా జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్ చొరవ తీసుకున్నారు.

రియల్ రంగానికి వెసలుబాటు

-కేంద్ర నిర్ణయంతో కంట్రాక్టులు 6నెలలు పొడిగింపు

న్యూఢిల్లీ,మే14(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ నేపథ్యంలో తలెత్తిన సంక్షోభం కారణంగా కాంట్రాక్టర్లకు ఊరట కల్పించే నిర్ణయాన్ని కేంద్రం ప్రకటించింది. నిర్మాణాలకు సంబంధించిన ఒప్పందాల గడువు కాంట్రాక్టులన్నింటినీ 6 నెలలు పొడిగింపు నిర్ణయం వెలువరించింది. పీపీపీ నిర్మాణాలకు కూడా ఈ పొడిగింపు వర్తించనున్నట్లు పేర్కొంది. అదేవిధంగా రెరా పరిధిలోకి వచ్చే రియల్ ఎస్టేట్ కంపెనీలకు ఊరట కల్పించింది. రెరా నిబంధనల ప్రకారం భవన నిర్మాణ పూర్తికి గడువును మరో 6 నెలలు పొడిగించింది. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల ఒప్పంద పనుల పూర్తికి సైతం 6 నెలల అదనపు సమయాన్ని ఇచ్చింది. నిర్మాణ, సేవల ఒప్పందాలకు సంబంధించి 6 నెలల వెసలుబాటు కల్పించింది. కేంద్ర ఏజెన్సీలు, కాంట్రాక్టర్లు బ్యాంకు గ్యారంటీలను పాక్షికంగా విడుదల చేసింది. పూర్తికాని పనుల ఆధారంగా బ్యాంకు గ్యారంటీలు పాక్షికంగా విడుదలకు గ్రీన్ సిగ్నల్ తెలిపింది. ఈ వెసులుబాట్లతో కాంట్రాక్టర్లకు నిధుల లభ్యత కొరత తగ్గుతుందని పేర్కొంది.

దేశంలో కొత్త జవసత్వాలకు ఇదే అదను

ఐటి,ఫార్మా,రియల్ రంగాలకు అండగా నిలవాలి

హైదరాబాద్,మే14(ఆర్ఎన్ఎ): భారతీయ ఆర్థిక వ్యవస్థలో గ్రామీణ ఆర్థికరంగం వాటానే ఎక్కువ. దేశానికి కొత్త జవసత్వాలనిచ్చేందుకు ఇదే మంచి సమయం. రూపాయి బలోపేతానికి అనుసరించాల్సిన మార్గాలపై కేంద్రం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి. ఇదే విషయాన్ఇన తెలంగాణ ఐటిశాఖ మంత్రి కెటిఆర్ కేంద్రానికి సూచించారు. దీంతో వివిధ రంగాల్లో అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు.ప్రభుత్వం అండగా నిలిస్తే ఉత్పత్తి, సేవా రంగాలు ఆరునెలల్లో గాడినపడతాయి. లాక్‌డౌన్ కారణంగా ఇప్పటి వరకు ఐటీ రంగం ఇప్పటికే నష్టపోగా, మరో రెండు నెలలు దానిపై కరోనా సంక్షోభ ప్రభావం ఉంటుంది. కొత్తగా ప్రాజెక్టుఉల రాకపోతే తీవ్ర నష్టాలను చవి చూడాల్సి ఉంటుందని నిపుణులు అంటున్నారు. ప్రపంచ దేశ ఆలు త్వరగా కోలుకునే కాలాన్ని బట్టి దీనిపై ప్రభావం ఉంటుందని అంటున్నారు. భారతీయ ఆర్థిక వ్యవస్థలో సేవారంగం వాటా 17 శాతం కాగా ఇందులో ఐటీరంగం వాటా కొద్ది మాత్రమే. కాబట్టి ఐటీ రంగంలో ఉద్యోగాల కోత, పింక్ స్లిప్‌ల జారీ వంటివి పెద్దగా ప్రభావం చూపవని అంచనా వేస్తున్నారు. ఈ రంగంలో వర్క్ ఫ్రమ్ హోం సంస్కృతి ఇకముందు కొనసాగకపోవచ్చని అంచనా వేస్తున్నారు. డేటా సెక్యూరిటీ, పనిలో నాణ్యత వంటివి దృష్టిలో పెట్టుకుని ఆఫీసు నుంచే పనిచేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఒక్క ఉద్యోగికి వంద చదరపు అడుగుల విస్తీర్ణం చొప్పున ఆఫీస్ స్పేస్ ఉండగా, భౌతికదూరం నిబంధన నేపథ్యంలో 150 చదరపు అడుగులకు విస్తరించాలి. కాబట్టి రాబోయే రోజుల్లో హైదరాబాద్ నగరంలో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ పెరుగుతుంది. మరోవైపు అమెరికా, యూరోప్‌లోని చిన్న, మధ్యతరహా ఐటీ కంపెనీలు ప్రస్తుత సంక్షోభం తర్వాత ఇక్కడి నుంచే తమ కార్యకలాపాలు నిర్వహిం వచ్చని అంటున్నారు. ఆతిథ్య రంగంలోనూ భౌతికదూరం నిబంధనతో నిర్మాణరంగానికి డిమాండ్ పెరగొచ్చంటున్నారు. కరోనా సంక్షోభానికి ఆర్నెల్ల ముందే ఆర్థిక పరిస్థితి ప్రపంచంతో పాటు భారత్‌లో కూడా మందగమనంతో సాగుతూ వచ్చింది. దీంతో మనం కరోనాకు ముందు, ఆ తర్వాతి పరిస్థితులను శాస్త్రీయంగా సమీక్షించుకోవాలి. 2022 లేదా 2023 నాటికి ఉండే పరిస్థితులను అంచనా వేసుకుని ముందుకెళ్లాలి. గతంలో కరువు నుంచి వ్యవసాయ రంగం గట్టెక్కినట్టే ప్రస్తుత సంక్షోభం నుంచి ఉత్పత్తి, సేవా రంగాలు తిరిగి పుంజుకోవడానికి ప్రభుత్వాలు ఉదారంగా ఆదుకోవాలి. గతంలో వరుసగా రెండు, మూడేళ్ల పాటు కరువొచ్చినా ఈ రంగం తిరిగి పుంజుకుంది. ఈ ఏడాది తెలంగాణ, ఏపీ లో వ్యవ సాయరంగం పురోగతి సాధిస్తోంది. ప్రభుత్వం ఈ రంగానికి అండగా నిలిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకుంటుంది. ఇదే తరహాలో ఉత్పత్తి, సేవా రంగాలూ పుంజుకుంటాయి. పెద్ద పరిశ్రమల మనుగడకు జీఎస్టీ నిబంధనల సడలింపు, రుణాల వసూలుపై మారటోరియం వంటివి అమలుచేయాలి. సెమీ అర్బన్, అర్బన్ ప్రాంతాల్లో మాత్రం సులభతర వాణిజ్య విధానాలు అమలయ్యేలా చూడాలి. హెలికాప్టర్ మనీ ఆలోచన మంచిదే కానీ సరైన పర్యవేక్షణ లేకుంటే వియత్నాం తరహా ప్రతికూల ఫలితాలు వస్తాయి. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం విషయానికొస్తే.. నిర్మాణ, ఇతర రంగాల్లో పనిచేసేందుకు తెలంగాణ గ్రామీణ ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి వలసలు వచ్చే కార్మికుల సంఖ్య వచ్చే పదేళ్లలో పదింతలు కావచ్చు. ఐటీ, ఫార్మా, మౌలిక వసతులు, ఎంఎస్ఎంఈ రంగాల్లో హైదరాబాద్ సాధిస్తున్న పురోగతే దీనికి కారణం. బ్యాంకులు కూడా రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించడం ద్వారా ఆదుకునేందుకు ముందుకు రావాలి.

కేసీఆర్,జగన్‌లవి మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు

పోతిరెడ్డిపాడు జివో అందులో భాగమే

దీనిపై కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదు: పొన్నం

కరీంనగర్,మే14(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు సీఎంలు జగన్, కేసీఆర్‌వి మ్యాచ్‌ఫిక్సింగ్ రాజకీయాలని మాజీ ఎంపి పొన్నంప్రభాకర్ మండిపడ్డారు. గతంలో పోతిరెడ్డి పాడుపై తీవ్ర విమర్శలుచేసిన సిఎం కెసిఆర్ నోరు ఇప్పుడు ఎందుకు పడిపోయిందన్నారు. 203జీవో ఇద్దరు సిఎంల మధ్య అవగాహనలో భాగమేనని పొన్నం ఆరోపించారు. తెలంగాణ సాగునీటి ప్రయోజనాలను దెబ్బతీసేలా కృష్ణా జలాల తరలింపునకు ఏపీ ప్రభుత్వం మరో ఎత్తిపోతల పథకం పేరుతో కుట్ర చేస్తోందని అన్నారు. ఇది తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో దీన్ని ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పక్షాన ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆనాడు కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం ఏ ప్రయోజనాల కోసం రాష్ట్రం ఇచ్చిందో.. ఇప్పుడు ఆ ప్రయోజనాలను దెబ్బతీసేలా ప్రస్తుత టీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కృష్ణా జలాల వినియోగం తగ్గించేలా కేసీఆర్ ప్రభుత్వం ఇరిగేషన్ అధికారులతో ప్రతిపాదనలు చేయించిందని, ఆవెంటనే ఏపీ ప్రభుత్వం 3టీఎంసీల మిగులు జలాల కోసం జీవో 203 విడుదలచేసిందని, దీనివెనుక ఇద్దరు సీఎంల మధ్యనున్న మ్యాచ్‌ఫిక్సింగ్ ఏంటో అర్థమవుతోందన్నారు.

ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు వద్ద ఎత్తిపోతల పథకం పెట్టి కృష్ణా జలాలు తరలిస్తే భవిష్యత్‌లో సాగర్ ఆయకట్టు ఎండిపోకతప్పదని పేర్కొన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి కృష్ణానీటి తరలింపు కోసం ఏపీ ప్రభుత్వం విడుదల చేసిన 203 జీవోను నిరసిస్తూ కాంగ్రెస్ మరిన్ని ఆందోళనలు చేస్తుందన్నారు. ఇప్పటికే సాగర్ ఆయకట్టుకు నీరు లేక చివరి భూములు ఎండిపోతున్నాయని, ఈపరిస్థితిలో మరిన్ని కృష్ణా జలాలు ఆంధ్రాకు తరలితే జిల్లా, రాష్ట్రం మరింత నష్టం పోవాల్సి వస్తుందున్నారు. తమ పార్టీ పక్షాన వ్యవహారం బయటపెట్టిన తర్వాతే కేసీఆర్ ప్రభుత్వం స్పందిస్తోందన్నారు. ఇప్పటికే సర్వేలు డిజైన్ల ప్రక్రియ జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం దీనిని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పోతిరెడ్డిపాడు నుంచి కృష్ణా జలాలు తరలిపోయి.. మహబూబ్‌నగర్, ఖమ్మం,నల్గొండ, రంగారెడ్డి జిల్లాలకు సాగునీటి, హైదరాబాద్‌కు తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. శ్రీశైలం ఎగువనుంచి నీరు ఏపీకి తరలితే సాగర్ ఆయకట్టు బీడుగా మారే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తన మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని, ఆయన మాటలతో భవిష్యత్‌లో పెద్దనష్టం జరగబోతుందన్నారు. పోతిరెడ్డిపాడు వద్ద బొక్కపెట్టి ఆంధ్రా వానులు నీరు తీసుకుపోతుంటే నారక్తం మరిగిపోతుందని ఉద్యమసమయంలో అన్న కేసీఆర్ ఈనాడు రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంకా జాగ్రత్తగా ఉండాల్సిన ముఖ్యమంత్రి ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటున్నారో అర్థం కావడం లేదన్నారు. దీనిపై కాంగ్రెస్ పక్షాన దశలవారీగా ఆందోళనలు చేస్తామని, న్యాయపరంగా పోరాటాలు చేస్తామన్నారు.

చితికి పోతున్న చిరువ్యాపారుల బతుకులు

రోజువారీ వడ్డీలతో నడిచే వారి ఆందోళన

హైదరాబాద్,మే14(ఆర్ఎన్ఎ): రోజువారీ అప్పులు తీసుకుని చిరువ్యాపారాలు చేసుకునే వారి పరిస్థితి దయనీయంగా మారింది. లాక్‌డౌన్‌తో వీరంతా రోడ్డు పడ్డారు. వ్యాపారాలు మూలన పడేసి ఇంటికే పరిమితం అయ్యారు. దీంతో వారికి జీవనం కష్టంగా మారింది. మాలాంటి వారికి ఎలాంటి సాయం అందడం లేదని వారు వాపోతున్నారు. నగరంలో లక్షలాది మంది మెడలపై వడ్డీ మాఫియా కత్తి వేలాడుతోంది. ఫలితంగా చిరు వ్యాపారులు, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. తీసుకున్న మొత్తాలకు వడ్డీతో పాటు అసలు చెల్లించాలి. వారిని మంచి చేసుకుంటేనే మళ్లీ రేపటి వ్యాపారాలకు అండగా ఉంటారు. బ్యాంకులు ఆదరించక పోవడంతో ఇలాంటి వారంతా ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రియించి ఉపాధి పొందుతున్నారు.అయితే రెండు నెలలుగా నగర వ్యాప్తంగా అన్ని వ్యాపారాలు స్తంభించిపోయాయి. నిత్యావసర సరుకులు మినహా మరే ఇతర బిజినెస్ సాగట్లేదు. ఫలితంగా చేతిలో చిల్లిగవ్వ లేని చిరు వ్యాపారులు, దందాలు ఆగిపోయి పెద్ద వ్యాపారులు సైతం వడ్డీ వ్యాపారుల చేతిలో చిక్కి విలవిల్లాడుతున్నారు. వడ్డీ వ్యాపారుల నుంచి బెదిరింపులు, వేధింపులపై ఫిర్యాదు చేయడానికి బాధితులు వెనుకాడుతున్నారు. పేదలకు అవసరమైన నిత్యావసరాలు, కొంత నగదు పంపిణీ.. కరోనా నిరోధానికి అమలులోకి వచ్చిన లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలేవీ వీరి దరికి చేరలేదు. ఆచరణలో మాత్రం ఇవేవీ అమలుకు నోచుకోవడంలేదు. గరంలో సాగుతున్న వడ్డీ వ్యాపారంలో 70 శాతం వరకు అక్రమ దందానే. ఈ వ్యాపారులు ఎలాంటి అనుమతులు తీసుకోరు. తాము చేసే టర్నోవర్ పైన, తీసుకుంటున్న వడ్డీపై ఎలాంటి పన్నులు చెల్లించరు. చిన్న స్థాయిలో జరిగే మిత్తి దందానే కాదు.. ప్రతి నెలారూ.లక్షలు, రూ.కోట్లలో లావాదేవీలు నెరిపే కొందరు పెద్ద వ్యాపారులదీ అదే తీరు. వీరిలో అత్యధికులు తమకు పరిచయస్తులకో, వారి ద్వారా పరిచయమైన వారికో మాత్రమే అప్పులు ఇస్తూ ఉంటారు. ష్యూరిటీగా ఖాళీ ప్రామిసరీ నోట్లు, స్టాంపు పేపర్లు, చెక్కులతో పాటు ఆస్తి పత్రాలను తమ అధీనంలో ఉంచుకుంటారు. ఇలాంటి దందా చేయడం అక్రమమైనా ఎవరూ పట్టించుకోక పోవడంతో వీరి వ్యవహారం యథేచ్ఛగా సాగుతోంది. నూటికి రూ.3 నుంచి రూ.6 వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. ఇక చిరు వ్యాపారులు, మధ్య తరగతి వారికి అప్పులు ఇచ్చేవారిది మరో వ్యవహారం. వీళ్లు రోజు, వారం, నెల లెక్కన తిరిగి చెల్లించే పద్ధతుల్లో అప్పులు ఇస్తుంటారు. ఆలస్యం అయితే వడ్డీ పెరుగుతుంది. వ్యాపారం కోసం తీసుకునే అప్పు తీర్చగా.. ఆ వడ్డీ చెల్లించడానికి సగానికి పైగా లాభం ఇచ్చేయాల్సి వస్తోంది. ఇప్పుడు వ్యాపారాలు లేక తినడానికే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వడ్డీ వ్యాపారుల నుంచి వేధింపులు పెరుగుతున్నాయి. తక్షణం అసలు, వడ్డీ చెల్లించకపోతే మళ్లీ అప్పు ఇవ్వబోమని, ఇంకెక్కడా పుట్టకుండా చేస్తామని బెదిరిస్తున్నారు. మరోవైపు మళ్లీ వ్యాపారం మొదలు పెడదామన్నా లాక్‌డౌన్ నిబంధనలు అనుమతించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. తమలాంటి వారిని ఆదుకోవాలని కోరుతున్నారు.

కరోనా నియంత్రణపై ప్రజల్లో చైతన్యం వచ్చింది

-కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్,మే 14 (నేటిని జంప్రతినిధి):కరోనా వైరస్‌వ్యాప్తి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అన్నివర్గాలకు చెందిన ప్రజల్లో చైతన్యంవచ్చిందని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. సామాజికదూరం పాటించడం, స్వీయనిర్భంధాన్ని స్వచ్ఛందంగా ఆచరించడం ఆహ్వానించదగిన పరిణామమని పేర్కొన్నారు.

కరోనా వైరస్‌వ్యాప్తి నియంత్రణ చర్యల్లో భాగంగా వివిధ మతాలకు చెందిన ప్రార్థనాస్థలాలను మూసివేయబడిన విషయం విదితమే. కరీంనగర్‌లోని వివిధ ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి గురువారం నాడు పోలీస్‌శాఖ అర్చకులకు నిత్యావసరవస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించింది. కరీంనగర్‌లోని వెంకటేశ్వరదేవాలయం ఆవరణలోని మిని కళ్యాణమండపంలో జరిగిన ఈ కార్యక్రమాన్నిపోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధర్మాన్ని నిలబెట్టేవృత్తిలో కొనసాగుతున్న అర్చకులు కొందరిని గుర్తించి,మానవతాహృదయంతో స్పందించి ఈ నిత్యావసర వస్తువుల పంపిణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నివిపత్కర పరిస్థితులు ఎదురైనా పోలీసులు రేయింబవళ్ళు శ్రమించి సత్ఫలితాలను సాధించేవిధంగా అర్చకులు పూజలందించాలని కోరారు. ఏకార్యమైనా అర్చకులు,పూజారులు లేకుండా ముందుకు సాగదని చెప్పారు. సాంప్రదాయబద్ధంగా అర్చకులకు మడిపంచా, 101రూపాయల దక్షిణ, తమలపాకులో వక్కలను అందజేస్తూ ఈ నిత్యావసరవస్తువులు పంపిణికార్యక్రమాన్ని నిర్వహించారు.

గురువారం నాడు జరిగిన ఈ కార్యక్రమంలో 60మంది అర్చకులకు నిత్యావసం వస్తువులు,కూరగాయలను అందజేశారు. మిగతా వారికి కూరగాయలను అందించారు. నిత్యావసరవస్తువులు ప్రస్తుతం అందుబాటులో లేనివారికి రెండవవిడత నిర్వహించే కార్యక్రమంలో అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి అర్చకులు మాస్కులు ధరించి హాజరయ్యారు. ఇదిప్రజల్లో వచ్చిన చైతన్యానికి సంకేతమని పేర్కొన్నారు.

20రోజులకు సరిపడా బియ్యం, పప్పులు,గోధుమరవ్వ, ఉప్మారవ్వ, చింతపండు,వంటనూనె,ఉల్లిగడ్డలు, నెయ్యి, నెయ్యితో తయారైన స్వీట్లు, కూరగాయలు పంపిణి చేశారు. తాము నిర్వహించిన కార్యక్రమానికి ముందుకు వచ్చిన దాతలు చిట్టిమల్ల శ్రీనివాస్, ఎలగందుల వీరేశం, బూస శ్రీనివాస్, దేవిశెట్టి రమేష్, వంగల రమేష్‌లతోపాటుగా వ్యక్తిగతంగా తమవంతు సహాయాన్ని అందించేందుకు ముందుకువచ్చిన అడిషనల్ డిసిపిలు ఎస్ శ్రీనివాస్, జి చంద్రమోహన్‌లను పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి అభినందించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు ఎస్ శ్రీనివాస్(ఎల్అండ్ఓ), జి చంద్రమోహన్(పరిపాలన), టౌన్ ఏసిపి అశోక్, ఇన్స్‌పెక్టర్లు విజయ్‌కుమార్, దేవారెడ్డి,విజ్ఞాన్‌రావు, దామోదరరెడ్డి, ఎస్ఐలు శ్రీధర్,శ్రీనివాస్‌లతోపాటుగా పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సెంటిమెంట్‌తో బలపడ్డ మార్కెట్లు

-మోదీ ప్యాకేజీతో లాభాల్లో ముగింపు

ముంబై,మే14(ఆర్ఎన్ఎ): ప్రధాని ప్రకటించిన 20లక్షల కోట్ల ప్యాకేజీ మార్కెట్లను లాభాల్లోకి తీసుకుని వెళ్లింది. మార్కెట్ సెంటిమెంట్ పండడంతో లాభాలతో ముగిసాయి. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక ప్యాకేజీ వివరాలను ప్రకటించడంతో గత రెండు రోజులుగా నష్టాల బాటలో పయనించిన దేశీయ స్టాక్‌మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు ఉద్దీపన కలిగించేందుకు ప్రధాని మోదీ రూ.20 లక్షల కోట్ల ప్యాకేజీ ప్రకటించిన విషయం తెలిసిందే. దాంతో మార్కెట్లు కళకళలాడాయి. ఒక దశలో 800 పాయింట్లకు పైగా పెరిగిన సెన్సెక్స్.. చివరకు 637 పాయింట్లు లాభపడి 32,008 కు చేరుకొన్నది. మరోవైపు జాతీయ స్టాక్ క్చేంజీ నిఫ్టీ కూడా 187 పాయింట్లు లాభపడి 9883 పాయింట్లకు చేరుకొన్నది. 1633 కంపెనీల షేర్ల ధరలు పెరుగగా.. 723 కంపెనీల షేర్లు పడిపోయాయి. ఉదయం దేశీయ స్టాక్‌మార్కెట్లు భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. కరోనా వైరస్ సంక్షోభం, లాక్‌డౌన్ నేపథ్యంలో రూ. 20 లక్షల కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిన నేపథ్యంలో మార్కెట్లు భారీ లాభాలతో ట్రేడింగ్ ను ఆరంభించాయి. సెన్సెక్స్ ఏకంగా 1200 పాయింట్లు, నిఫ్టీ 300 పాయింట్లు ఎగిసింది. కీలక సూచీలు రెండూ ప్రధాన మద్దతు స్థాయిలను దాటేసాయి. దీంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలంగా వుంది.

దాదాపు అన్ని రంగాల షేర్లు లాభాలతో దూసుకుపోయాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్స్, ఆటో, మెటల్ షేర్లలో కొనుగోళ్ల ధోరణి నెలకొంది. నెస్లే, భారతి ఎయిర్‌టెల్, టీసీఎస్, సన్ ఫార్మ, హెచ్‌సీఎల్ టెక్ స్వల్పంగా నష్టపోతున్నాయి.

ప్రభుత్వ డాక్టర్ భార్య ఆత్మహత్య

నల్లగొండ,మే14(ఆర్ఎన్ఎ): నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ప్రభుత్వ వైద్యుడి భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. రెడ్డి కాలనీలోని అహల్య అపార్ట్‌మెంట్‌లో డాక్టర్ కుమార్ బండారు దంపతులు నివాసం ఉంటున్నారు. ఆయన భార్య శ్వేత కూడా దంత వైద్యురాలు. అయితే బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె బెడ్రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కాగా భార్య మృతదేహం చూసి డాక్టర్ కుమార్ భోరున విలపించారు. అయితే కుటుంబ కలహాల కారణంగానే శ్వేత ఈ ఘటనకు పాల్పడినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జీలుగు విత్తనాలతో భూసారం : మంత్రి

వరంగల్,మే14(ఆర్ఎన్ఎ): జీలుగు విత్తనాలు వేసి భూసారాన్ని కాపాడాలని రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు రైతులకు పిలుపునిచ్చారు. తొర్రూరులో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం లో జీలుగు విత్తనాల అమ్మకాన్ని మంత్రి ప్రారంభించారు. ఎరువులు, క్రిమి సంహారక మందులతో భూసారం తరుగుతుందన్నారు. భూసారాన్ని కాపాడాలంటే జీలుగుకంటే మెరుగైన సాధనం లేదన్నారు. అదిక దిగుబడులు రావాలన్నా, నాణ్యమైన పంటలు పండాలన్నా, జీలుగుని వాడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్, మండల రైతు బంధు కో ఆర్డినేటర్ అనుమాండ్ల దేవేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రామిని శ్రీనివాస్, కౌన్సిలర్లు శ్రీనివాస్, నట్వర్, రేవతి శంకర్, ప్రవీణ్ రాజు, సంపత్, ఎఓ కుమార్ యాదవ్ , ఎఇఓ, లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కల్లుదుకాణాలకు గ్రీన్ సిగ్నల్

అనుమతులు మంజూరు చేసిన సర్కార్

హైదరాబాద్,మే14(ఆర్ఎన్ఎ): కంటైన్‌మెంట్ జోన్లలో మినహా మిగిలిన అన్నిజిల్లాల్లోనూ కల్లుదుకాణాలు తెరిచేందుకు ప్రభుత్వం అనుమతించిందని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఇప్పటికే వైన్స్‌కు అనుమతి ఇవ్వడంతో గౌడ కులస్థులు తమకు కూడా అనుమతి ఇవ్వాని కోరారు. దీంతో ప్రభుత్వ కల్లు దుకాణాలు తెరవాలని నిర్ణయించింది. బుధవారం దీనికి సంబంధించి ఉత్తర్వులు జారీ అయ్యాయని మంత్రి తెలిపారు. కంటైన్‌మెంట్ జోన్‌ల మినహా మిగిలిన అన్నిజిల్లాల్లో గీత కార్మికులు కల్లును భౌతిక దూరాన్ని పాటిస్తూ, లాక్‌డౌన్ నిబంధనల ప్రకారం అమ్ముకునేందుకు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన మెమో నెం.6837 వల్ల రాష్ట్రంలో దాదాపు 3లక్షల మంది కల్లుగీత కార్మికులకు ఉపాధి అవకాశాలు, సుమారు 40 లక్షల మందికి పరోక్షంగా జీవనోపాధి కలుగుతుందన్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో వివిధ జిల్లాల్లో గీత కార్మికుల కులవృత్తిని,ఉపాధిని కొనసాగించే క్రమంలో అక్కడక్కడ కొన్ని సంఘటనలు జరిగాయన్నారు. గీత కార్మికుల విజ్ఞప్తి మేరకు సీఎం కేసీఆర్ వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని లాక్‌డౌన్ ఉన్నా గీత వృత్తిదారులు తమ వృత్తిని కొనసాగించుకోవాలని అనుమతులు ఇచ్చారన్నారు. లాక్‌డౌన్ ఎత్తివేసిన తర్వాత త్వరలోనే నీరా కేంద్రాలను ఏర్పాటుచేస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గీత వృత్తిదారులను ప్రోత్సహించడానికి ఇప్పటి వరకూ 3కోట్ల 54 లక్షల తాగి, ఈత చెట్లను నాటామని అన్నారు. హరితహారంలో భాగంగా ఇంకా కోట్లాది తాటి , ఈత మొక్కలను ప్రజా ప్రతినిధులతో కలిసి ఈ వర్షాకాలంలో నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో రంజాన్ కానుకలు పంపిణీ

-పేదలకు అండగా ఉంటున్నామన్న మంత్రి హరీష్

సిద్దిపేట,మే14(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ ప్రభుత్వంలోనే నిజమైన రైతు రాజ్యం వచ్చిందని మంత్రి హరీష్ రావు అన్నారు. వారికి అన్ని విధాలా అండగా ఉన్నది తామేనని అన్నారు. అలాగే అన్నివర్గాలకు అండగా ఉంటూ పండగల సమయంలోనూ ఆదుకుంటున్నామని అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నిమ్రా గార్డెన్‌లో ముస్లిం మహిళలకు రంజాన్ పండుగ కానుకలను మంత్రి హరీష్ రావు పంపిణీ చేశారు. అదేవిధంగా కొండా భూదేవి గార్డెలో సిద్దిపేట రూరల్ మండలంలో 209 మందికి, సిద్దిపేట అర్బన్ మండలంలోని 305 మందికి పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. లాక్‌డౌన్ వల్ల ప్రజల జీవనం ఇబ్బందిగా మారిందన్నారు. కరోనాకి మందు రావడానికి ఇంకా సమయం పడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించి భౌతిక దూరం పాలించాలని హరీష్ రావు సూచించారు. మాస్క్ లేకుండా బయట తిరిగితే రూ.1000 జరిమానా తప్పదని హెచ్చరించారు. కాళేశ్వరం నీళ్లు వచ్చాక మొదటిసారి పట్టాల పంపిణీ జరుగుతోందన్నారు. రైతులు పెద్ద మనసుతో సహకరించి కాలువల భూ సేకరణకు సహకరించాలని మంత్రి హరీష్ రావు విజ్ఞప్తి చేశారు. ఎంతో మంది రైతులు సహకరిస్తేనే కాళేశ్వరం నీళ్లు ఇక్కడి వరకు వచ్చాయన్నారు. భూసేకరణకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. టీఆర్ఎస్ ప్రభుత్వంలోనే నిజమైన రైతు రాజ్యం వచ్చిందని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ సూచనలను పాటిస్తూ రైతులు ముందుకు వెళ్లాలని హరీష్ రావు సూచించారు.

లాక్‌డౌన్ నిబంధనల్లో మినహాయింపు

-వ్యాపార,వాణిజ్యాలకు అనుమతి

అమరావతి,మే14(ఆర్ఎన్ఎ): లాక్ డౌన్‌లో మరిన్ని మినహాయింపులనిస్తూ ఏపీ ప్రభుత్వం కొత్త గైడ్ లైన్స్ విడుదల చేసింది. కంటైన్మెంట్ జోన్లలో తప్ప మిగతా చోట్ల షాపులను తెరుచుకోవచ్చునని ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 5 గంటలకు అన్ని షాపులు తెరుచుకోవచ్చునని తెలిపింది. షాపింగ్ కాంప్లెక్స్‌లు, మార్కెట్లు, మార్కెట్ కాంప్లెక్సులు, రూరల్, అర్బన్ ప్రాంతాల్లో షాపులు తెరవకూడదని ఆదేశాలు జారీ చేసింది. గ్రామాల్లో ఉన్న షాపులు, రెసిడెన్షియల్ ప్రాంతాల్లో ఉన్న షాపులను తెరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా అనుమతినిచ్చింది. వస్త్ర, నగల, చెప్పుల షాపులను తెరిచేందుకు అనుమతి ఇవ్వలేదు. పట్టణాల్లో సర్వీసు విధానాల్లో షాపులు తెరిచేందుకు మాత్రమే అనుమతినిచ్చింది. అతి తక్కువ పాజిటివ్ కేసులున్న మున్సిపల్ కార్పొరేషన్లలో నిత్యావసర సరకుల షాపులు మాత్రమే తెరిచి ఉండేలా జగన్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. షాపుల ముందు భౌతిక దూరాన్ని పాటించాలని, గ్రౌండ్ మార్కింగ్ చేయాలని సూచించింది. వినియోగదారులు, అమ్మకం దారులు మాస్క్ తప్పనిసరిగా ధరించాలని మార్గదర్శకాల్లో సూచించింది. షాపుల వద్ద శానిటైజర్ అందుబాటులో ఉంచాలని పేర్కొంది. కంటైన్మెంట్ జోన్ల పరిధిలోని షాపులను చెప్పేంత వరకు తెరవకూడదని ఆదేశించింది. తెరిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపింది.

పోలీస్‌స్టేషన్ల పరిపాలన అధికారులకు శిక్షణ

కరీంనగర్, మే 14 (నేటినిజం ప్రతినిధి):కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన పరిపాలన అధికారులకు శిక్షణ కార్యక్రమం గురువారం నాడు కమీషనరేట్ కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా సిటి స్పెషల్‌బ్రాంచి ఇన్స్‌పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదు విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం విషయంలో సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు సత్వరం సేవలందించడమే లక్ష్యంగా పోలీసులు ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. వివిధ రకాల సమస్యలతో పోలీస్‌స్టేషన్లకు వచ్చే ప్రజలను వివిధ రకాల కారణాలతో తిప్పించుకుండా వారికి కనీస మర్యాదనిచ్చి ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. ఫిర్యాదుదారులకు సంబంధించిన ఫోన్‌నెంబర్లను తీసుకోవాలని తెలిపారు. మహిళలు,విద్యార్థినులకు సంబంధించిన ఫిర్యాదుల విషయంలో సత్వరం స్పందించి విచారణ జరుపాలని చెప్పారు. ప్రస్తుతం పోలీస్‌శాఖలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరిగిందని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టుసాధించాలని పిలుపునిచ్చారు. పోలీస్‌స్టేషన్లకు చెందిన పరిపాలన అధికారులు పోలీస్‌స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరుపై స్పష్టమైన అవగాహన కలిగిఉండాలని సూచించారు. పోలీస్‌స్టేషన్లలోని వివిధ విభాగాలు సమిష్టిగా పనిచేయడం ద్వారా కేసుల పరిష్కారాలు లభిస్తాయని గుర్తించాలని తెలిపారు.

బ్లూకోల్ట్స్, పెట్రోకార్స్ విభాగాలకు శిక్షణ

బ్లూకోల్ట్స్, పెట్రోకార్ విభాగాలకు చెందిన పోలీసులకు శిక్షణ కార్యక్రమం గురువారం నాడు కమీషనరేట్ కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా కరీంనగర్ వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సమాచారం అందిన వెంటనే సత్వరం స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని సేవలందిస్తూ, దర్యాప్తు అధికారి వచ్చేంత వ్యవధిలో ప్రాథమిక సమాచారం సేకరించాలన్నారు. గస్తీ తిరుగుతున్న ప్రాంతాల్లో పిక్కెట్లు,రౌడీ,మతతత్వ విద్వేషకారుల పాల్పడే హిస్టరీషీటర్లు,అనుమానాస్పదులపై నిఘా ఉంచడంతోపాటు ప్రతివారిని గుర్తించాలని చెప్పారు. బ్లూకోల్ట్స్ బృందాలు అన్నివర్గాలకు చెందిన ప్రజలతో సత్సంబంధాలను కొనసాగిస్తూ సమాచార వ్యవస్థను పెంపొందించుకోవాలన్నారు. సమాచార వ్యవస్థను పెంపొందించుకోవడం ద్వారానే విధుల్లో సమర్ధవంతంగా రాణించవచ్చని పేర్కొన్నారు.

16నుంచి రెండో విడత వందే భారత్

ఏర్పాట్లు చేసిన పౌరవిమానయాన శాఖ

న్యూఢిల్లీ,మే14(ఆర్‌ఎన్‌ఎ): వందేభారత్ మిషన్ రెండోదశలో భాగంగా 31దేశాల నుంచి 30 వేల మంది భారతీయులను వెనక్కి తీసుకురానున్నారు. ఈ మేరకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేసింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి తెలిపారు. ఈ నెల 16 నుంచి 22వ తేదీ మధ్య ఎయిరిండియాకు చెందిన 149 విమానాల్లో వారిని తీసుకొస్తామన్నారు. వందే భారత్ మిషన్ తొలి దశలో భాగంగా ఈనెల 7 నుంచి 14మధ్యలో 12 దేశాల నుంచి మొత్తం 14,800 మంది భారతీయులను వెనక్కి తేవాలని నిర్ణయించామని, ఇప్పటికే 9వేల మంది వచ్చారని వివరించారు. బుధవారం అమెరికా నుంచి 250 మంది భారతీయులు బయల్దేరారు.అమెరికా నుంచి భారత్‌కు వచ్చేందుకు 28వేల మంది దరఖాస్తు చేసుకున్నారని భారత రాయబారి తరణ్‌జిత్ సింగ్ సంధు చెప్పారు. మరోవైపు ఆస్ట్రేలియాలో చిక్కుకున్న భారతీయుల కోసం ఈ నెల 21 నుంచి 28 మధ్య 7 విమానాలు నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఇదిలావుంటే కరోనా వైరస్ ప్రపంచం వ్యాప్తంగా వ్యాపించిన నేపథ్యంలో దానిపై పోరాటంలో భారత్‌లోని వైద్యనిపుణులు మాదిరిగానే యూఎస్, యూకేలలోని భారత సంతతికి చెందిన వారు కూడా తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇంట్లోవారికి కూడా కరోనా వైరస్ ఎక్కడ సోకుతుందోనని యూకేలోని వైద్యులు తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నట్లు లండన్ కేంద్రంగా పని చేస్తున్న భారత సంతతికి చెందిన కొందరు చెప్పారు. కొన్ని సంవత్సరాల క్రితం ఈ వృత్తిని ఎన్నుకున్నానని, బాధ్యతల నుంచి తప్పుకోలేనని, ఈ కష్టకాలంలో పని చేయడం తప్ప తనకు మరో మార్గం లేదని చెప్పారు. హాట్ జోన్లలో రోజుకు 75 నుంచి 100 మంది రోగులను చూస్తున్నట్లు తెలిపారు. సహోద్యోగులు అనారోగ్యానికి లోనవడంతో వైద్య సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. న్యూయార్క్‌లో ఒక ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సు కూడా ఇదే రకమైన ఆందోళనలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. న్యూయార్క్ లాంటి నగరంలో తాము ఎంత జాగ్రత్తగా ఉన్నా ప్రజల రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రారంభంలో కేసులు మొదలైనప్పుడు ప్రజలు ఇంత ఎక్కువ ఆందోళన చెందలేదని చెప్పారు. కేసులు పెరిగినప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోలేదన్నారు. తాము విధులు నిర్వహించే 10 నుంచి 12 గంటల సమయం మాస్కులు ధరించడం శారీరకంగా చాలా అసౌకర్యంగా ఉన్నట్లు తెలిపారు. వైరస్ స్వభావం తెలియని కారణంగా పరిస్థితి భయంకరంగా మారిందని చెప్పారు. వైరస్ గురించి తెలుసుకునేలోపే అది ప్రపంచం అంతా వ్యాపించిందన్నారు.

సిఎం కేసీఆర్ మొండి మనిషి

ప్రాజెక్టులను పూర్తి చేయడంతో తెలిసింది
దేవాదుల కాల్వలకు నీరు విడుదల చేసిన మంత్రి ఎర్రబెల్లి

జనగామ,మే14(ఆర్‌ఎన్‌ఎ):ముఖ్యమంత్రి కేసీఆర్ మాట నిలుపుకునే మొండిమనిషని, అందుకే నీటి ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేస్తున్నారని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ వస్తే ఏమొస్తది అన్న వారికి ఈసాగునీరు, పండుతున్న పంటే సమాధానమని మంత్రి ఎర్రబెల్లి స్పష్టం చేశారు. వరంగల్ అర్బన్‌జిల్లా పరిధిలోని ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి దేవాదుల కాలువల ద్వారా సాగునీటిని మంత్రి విడుదల చేశారు. ఈసందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ కాలువల ద్వారా సాగునీటికి నోచుకోని ప్రజల కల నెరవేరిందన్నారు.ఈ కాలువల ద్వారా వర్దన్నపేట, స్టేషన్ ఘనపూర్, పరకాల ఈ మూడు నియోజకవర్గాల పరిధిలోని 8 మండలాలు, 33 గ్రామాల్లో 91,700 ఎకరాలకు సాగునీరు అందనుంది. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వల్లే దేవాదుల నుంచి 365 రోజుల పాటు నీళ్లు ఎత్తిపోస్తున్నామన్నారు. కాళేశ్వరం, దేవాదుల ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. కేసీఆర్ సీఎం అయిన తర్వాత రైతుల ధర్నాలు లేవన్నారు. రూ. 30 వేల కోట్లతో ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. విపత్కర సమయంలో రైతు బంధు, రుణమాఫీకి నిధులు విడుదల చేసిన ఘనత సీఎం కేసీఆర్‌ది అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో రైతు ప్రభుత్వం నడుస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులు, సంకల్పంతో ప్రజల సాగునీటి కలలు సాకారమయ్యాయని అన్నారు. కాళేశ్వరం ఎస్సారెస్పీ, తాజాగా దేవాదుల నీరు ఇక్కడి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. చెన్నారం, బొల్లికుంట చెరువులు నిండి ఈ ప్రాంతం సస్యశ్యామలం కానుందని తెలిపారు. ఇప్పటికీ రాష్ట్రంలో 40లక్షల ఎకరాల్లో వరిసాగు అయ్యింది. దిగుబడులు కూగా అత్యధికంగా వచ్చాయని మంత్రి పేర్కొన్నారు. రో 20లక్షల ఎకరాల్లో మక్కలు, ఇతర పంటు పండాయి. మరో 40లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తే మన తెలంగాణ కోటి ఎకరాల మాగాణ అవుతుందని మంత్రి తెలిపారు. అందుకే తెలంగాణ సాధించారని చెప్పారు. తెచ్చిన తెలంగాణను బంగారు మయం చేయడమని ఖాయమన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ అర్బన్ జెడ్పీ ఛైర్మన్ సుధీర్‌కుమార్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, ఆరూరి రమేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దేవాదుల కాల్వలకు నీరు విడుదల చేసిన తరవాత జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబల్లి దయాకర్ రావు. చిత్రంలో ఎమ్మెల్యే రాజయ్య తదితరులు ఉన్నారు.

నగర శివారులో చిరుత కలకలం

పట్టుకునేందుకు అటవీసిబ్బంది యత్నం

హైదరాబాద్,మే14(ఆర్‌ఎన్‌ఎ): ఓ వైపు కరోనా మహమ్మారితో వణికిపోతున్న నగర శివారు ప్రజలకు.. చిరుత భయంపట్టుకుంది. రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో

చిరుత ప్రత్యక్షమైంది. జాతీయ రహదారి ఎన్‌హెచ్7 సమీపంలోని కాటేదాన్ అండర్ బ్రిడ్జ్ రోడ్డుపై ఓ పక్కన కూర్చొంది. అయితే అటుగా వాహనాలు పోతున్నప్పటికీ అది ఓ మూలన కూర్చుండిపోయింది. చిరుతను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు చిరుత ఉన్న ప్రదేశానికి చేరుకుని పరిశీలించారు. దానికి తీవ్రంగా గాయాలవ్వడంతో.. అది కదలకుండా అక్కడే కూర్చుండిపోయింది. చిరుత గురించి పోలీసులు అటవీ అధికారులకు సమాచారం అందించి.. అటువైపుగా వచ్చే వాహనాలను దారిమళ్లించారు. అటవీశాఖ, జూపార్క్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని చిరుతను బంధించేందుకు ప్రయత్నించగా.. అంతలోనే ఆ చిరుత వారి నుంచి తప్పించుకుని సమీపంలో ఫంక్షన్‌హాలులోకి వెళ్లింది. ఈ క్రమంలో ఓ వ్యక్తిని గాయపరిచింది. వెంటనే పోలీసులు.. సదరు బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. చిరుతను పట్టుకునేందుకు అటవీ సిబ్బంది రంగంలోకి దిగింది.

ప్రపంచ స్థాయి టూరిజం కారిడార్‌గా ఉమ్మడి వరంగల్ అభివృద్ధి

ములుగు, మే 14 (నేటినిజం ప్రతినిధి):: అద్భుతమైన ప్రపంచ స్థాయి టూరిజం కారిడార్ గా ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. వరంగల్ ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలన్నదే సిఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ లక్ష్యమని చెప్పారు. అందునా వరంగల్ టూరిజం విషయంలో వారు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ఆయన తెలిపారు. రామప్పని సందర్శించిన శ్రీనివాస రెడ్డి, ఇప్పటి వరకు ప్రగతిలో ఉండి కరోనా ఎఫెక్టుతో ఆగిపోయిన పనులన్నింటినీ తిరగి వేగిరం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్కడి అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, రామప్ప అతి పురాతనమైన శిల్ప కళా వైశిష్ట్యంతో కూడిన దేవాలయమన్నారు. అలాగే లక్నవరం సహజసిద్ధంగా కొద్దిపాటి మానవ ప్రతయ్నంతో కాకతీయుల కాలంలో ఏర్పాటు చేసిన అతి పెద్ద చెరువు అని చెప్పారు. కరువు కాటకాల నుంచి రాజుని ఎదురించి తమ ప్రజలను కాపాడే ప్రయత్నం చేసిన పోరాట యోధులు సమ్మక్క-సారలమ్మల గద్దె మేడారం . మరోవైపు కాకతీయుల రాజధాని, కోట, ఏకశిలా నగరం, ఆదికవి పాల్కురికి సోమనాథుడు, పోతనామాత్యుడు, కవులు, కళాకారులు.. చారిత్రక ప్రదేశాలతో ఇంతగా సంస్కృతీ, సంప్రదాయాలను, చరిత్రను తెలిపే నగరాలు అరదుగా ఉంటాయని వివరించారు. ఈ చరిత్ర, సంస్కృతి మీద అత్యంత అవగాహన ఉన్న సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ వరంగల్ ని అగ్రగామిగా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

కొనసాగుతున్న కరోనా వ్యాప్తి

78,768 కరోనా కేసులు నమోదు

న్యూఢిల్లీ,మే14(ఆర్‌ఎన్‌ఎ): ప్రస్తుతం భారత దేశంలో కరోనా వైరస్ వేగంగా వ్యాపిస్తోంది. గత మూడు రోజుల నుంచి రోజుకు మూడు వేలకు పైగా కేసులు నమోదవుతున్నాయి.

ఇండియాలో 78,768 కరోనా కేసులు నమోదుకాగా 2564 మంది చనిపోయారు. కరోనా వైరస్ నుంచి 26,675 మంది కోలుకోగా 49,524 మంది చికిత్స పొందుతున్నారు.దేశ రాజధాని ఢిల్లీలో కొత్తగా 472 కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో ఢిల్లీలో కరోనా బాధితుల సంఖ్య 8470కి చేరకోగా 115 మంది మృత్యువాతపడ్డారు. మహారాష్ట్రలో కరోనా వైరస్ కలవర పెడుతోంది. ఒక ముంబయిలో కరోనా కరాళ నృత్యం చేస్తుంది. ఒక్క ముంబయిలో కరోనా కేసులు దాదాపుగా 16 వేలు నమోదయ్యాయి. మహారాష్ట్రలో కరోనా బాధితుల సంఖ్య 25,922కు చేరుకోగా 975 మంది మృత్యువాతపడ్డారు. తెలంగాణలో 1367 కేసులు నమోదు కాగా 34 మంది మరణించారు. ఎపిలో 68 కొత్త కేసులు నమోదు కాగా 2205కు చేరుకున్నాయి. ఒడిశా 73, రాజస్థాన్‌లో 66, కర్నాటక 22, ఝార్ఖండ్ 4, అస్సాం 6 కేసులు నమోదయ్యాయి. ప్రపంచంలో కరోనా వైరస్ 44.30 లక్షల మందికి వ్యాపించగా మూడు లక్షల మంది బలయ్యారు. అమెరికాలో కరోనా విజృభిస్తోంది. అమెరికాలో 14.30 లక్షల మందికి కరోనా వ్యాపించగా 85 వేల మంది మృతి చెందారు. న్యూయార్క్‌లో కరోనా కలవర పెడుతోంది. న్యూయార్క్‌లో 3.50 లక్షల మందికి వ్యాపించగా 27 వేల మంది చనిపోయారు.

ఇద్దరు యువతుల వివాహాలకు ఆర్థిక సాయం

రంగారెడ్డి,మే14(ఆర్‌ఎన్‌ఎ): తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువతులు మానస, గాయత్రిలకు ఉప్పల ఛారిటబుల్ ట్రస్టు నుంచి గురువారం జడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ ఆర్థికసాయం అందజేశారు. పేద కుటుంబాలకు చెందిన ఈ యువతుల వివాహాలకు ట్రస్టు నుంచి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచి లలిత, నాయకులు జ్యోతయ్య, శేఖర్‌యాదవ్, రమేష్, జాంగీర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని పెద్దూర్ తండా గ్రామ పంచాయతీలో గురువారం ఉపాధి కూలీలకు ఎంపీటీసీ సభ్యుడు రఘునాయక్ మాస్క్‌లు పంపిణీ చేశారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు కరోనా వ్యాపించే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యువకులతో కలిసి అవగాహన కల్పించారు. సామాజిక దూరం పాటిస్తూ పనులు చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్క్‌లు ధరించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా 185 మంది ఉపాధి కూలీలకు మాస్క్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచి దేవీ, నాయకులు నరేష్, సాయికుమార్, శ్రీను, రవి, నవీన్, హీరాలాల్, పుల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ చేసిన స్పీకర్

కామారెడ్డి,మే14(ఆర్‌ఎన్‌ఎ): జిలల్లోని బాన్సువాడ పట్టణంలోని జీఆర్‌ఆర్ గా÷-డ్గ÷న్స్‌లో పలువురికి స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. పోచారం ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్రాహ్మణులు, క్రైస్తవ మత గురువులు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎమ్‌లు, మున్సిపల్ కార్మికులు, జర్నలిస్టులు, పోలీసులు, హోంగార్డులకు ఉచిత బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, టీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ పోచారం సురేందర్‌రెడ్డి, ఆర్డీవో రాజశ్వర్, డీఎస్పీ దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

డైనమిక్ విధానంలో మీటర్ రీడింగ్

విద్యుత్ బిల్లులపై మంత్రి సుచరిత వివరణ

గుంటూరు,మే14(ఆర్‌ఎన్‌ఎ): రాష్ట్రంలో విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయనే అపోహలు వస్తున్నాయని.. అయితే విద్యుత్ కార్పోరేషన్ నిబంధనల ప్రకారమే విద్యుత్ రీడింగ్ తీయడం జరుగుతుందని హోంమంత్రి సుచరిత తెలిపారు. గురువారం విద్యుత్ అధికారులతో హోంమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పారదర్శకంగా బిల్లులు తీయడం జరుగుతుందని చెప్పారు. మార్చి నెలలో గత సంవత్సరం టారిఫ్ ప్రకారం తీస్తున్నారని... ఏప్రిల్ నెల బిల్లులను డైనమిక్ విధానం ద్వారా తీస్తున్నారని మంత్రి వెల్లడించారు. డైనమిక్ విధానం ప్రకారం ఎంత వరకు విద్యుత్‌ను వినియోగించుకున్నారో అంతే బిల్లు వస్తుందని తెలిపారు. 2స్లాబ్ విధానం కాకుండా డైనమిక్ విధానంలో బిల్లులు తీయడం జరుగుతుందని పేర్కొన్నారు. డైనమిక్ విధానంతో ప్రజలకు లాభం చేకూరుతుందన్నారు. విద్యుత్ వినియోగం పెరగడం వాస్తవమని... జూన్ 30 నాటికి ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా బిల్లులు చెల్లించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని తెలిపారు. సందేహాల కోసం ప్రత్యేక కాల్ సెంటర్ అందుబాటులో ఉంచామని హోంమంత్రి సుచరిత పేర్కొన్నారు.

మరోమారు ఉలిక్కిపడ్డ జనగామ

ఇద్దరికి కరోనా పాజిటివ్‌తో కలకలం
ఆ ఇద్దరూ వలస కార్మికులే అని వెల్లడి
అప్రమత్తం అయిన వైద్యాధికారులు

జనగామ,మే14(ఆర్‌ఎన్‌ఎ): కరోనా ఫ్రీగా మారిన జనగామ జిల్లా మరోమారు ఉలిక్కిపడింది. వసలకార్మికుల రూపంలో కరోనా మరోమారు పలకరించడంతో జిల్లాలో ఆందోళన నెలకొంది. జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు తగ్గుముఖం పడుతున్న సమయంలో వలస కార్మికుల రూపంలో మళ్లీ కలకలం రేపింది. గతంలో మర్కజ్‌కు వెళ్లి వచ్చిన ఇద్దరికి పాజిటివ్ రాగా, అదే రైలులో ప్రయాణించిన ఓ జవాన్‌కు సైతం పాజిటివ్‌గా నిర్ధారణ అయింది.

ఇందులో ఇద్దరు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి కాగా, ఒకరికి చికిత్స కొనసాగుతోంది. ప్రస్తుతం ఆరెంజ్ జోన్‌లో ఉన్న జనగామ జిల్లాలోని 12 మండలాల పరిధిలో 100 శాతం, మునిసిపల్ పరిధిలో 50 శాతం వ్యాపారాలకు ప్రభుత్వం సడలింపునిచ్చిన సమయంలో మహారాష్ట్ర నుంచి వచ్చిన వలస కార్మిక భార్యాభర్తలకు కరోనా పాజిటివ్ రావడం ఆందోళన కలిగిస్తుంది. రఘునాథపల్లి, లింగాలఘనపురం, బచ్చన్నపేట మండలానికి చెందిన 25 మంది బతుకుదెరువు కోసం మహారాష్ట్రకు వెళ్లారు. అక్కడి బాంద్రా గ్రామం కేర్వాడి మండల పరిధిలో నివాసముంటూ రోజువారి పనులు చేసుకుంటున్న వారు లాక్‌డౌన్‌తో యాభై రోజుల పాటు ఇబ్బందులు పడ్డారు. అక్కడి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక బస్సు మాట్లాడుకుని ఈనెల 10వ బయలు దేరి 11వ తేదీ రాత్రి జిల్లాకు చేరుకున్నారు. ఇందులో రఘునాథపల్లి మండలం నిడిగొండకు చెందిన దంపతులు, బచ్చన్నపేట మండలం కొన్నెకు చెందిన ఐదుగురితో పాటు లింగాలఘనపురం మండలానికి చెందిన 18 మంది ఉన్నారు. కొన్నెకు చెందిన ఐదుగురు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో దిగి ఆటోలో స్వగ్రామానికి వెళ్లారు. ఇక నిడిగొండకు చెందిన భార్యాభర్తలు జనగామ నుంచి ద్విచక్రవాహనంపై వెళ్లారు. అదేరోజు రాత్రి 11 గంటలకు వారికి దగ్గు, గొంతులో మంట రావడంతో స్థానిక వైద్య సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. దీంతో అప్రమత్తమైన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అశోక్‌కుమార్, డీఎస్‌ఓ పూర్ణచందర్, మండల వైద్యాధికారిని స్రవంతి సిబ్బందితో చేరుకుని దంపతులను అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని కింగ్‌కోఠి ఆస్పత్రికి తరలించారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో వారికి పాజిటివ్‌గా తేలినట్లు గురువారం నివేదిక వచ్చిందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మహేందర్ తెలిపారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన వలస కార్మికులకు కరోనా పాజిటివ్‌గా తేలడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. వైద్య, ఆరోగ్య, రెవెన్యూ, పోలీసు శాఖలు అప్రమత్తమై ప్రస్తుతం హోం క్వారంటైన్‌లో ఉన్న 23 మంది వలస కార్మికులు ఉన్న గ్రామాలకు వెళ్లారు. 28 రోజుల పాటు బయటకు రావొద్దని ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. దగ్గు, దమ్ము, జ్వరం వస్తే తమకు సమాచారం ఇవ్వాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. కాగా, డీసీపీ శ్రీనివాసరెడ్డి, ఏసీపీ వినోద్ కుమార్ కూడా గ్రామాలకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.ం

అంగన్‌వాడీల సేవలు అమోఘం: మంత్రి

హైదరాబాద్,మే14(ఆర్‌ఎన్‌ఎ): లాక్ డౌన్ సమయంలో అంగన్ వాడీ కేంద్రాలు మూసి వేయొద్దని ముందు అనుకున్నా తప్పని పరిస్థితుల్లో మూసేసామని స్త్రీ - శిశు సంక్షేమ శాఖ మంత్రి త్యవతి రాథోడ్ అన్నారు.

అందుకే వారికి ఆహారాన్ని ఇంటింటికి సరఫరా చేయాలని నిర్ణయించామన్నారు. అంగన్ వాడీ సేవలు, సరుకులు పొందడంలో ఏ ఒక్కరూ మిస్ కావొద్దని సీఎం కేసీఆర్ చెప్పారని, దీనిని వందశాతం పాటించాలన్నారు. బాలింతలు, గర్భిణులు, పిల్లలకి ఎక్కువ సమస్యలు ఉంటాయి, కావున మనం వారిపట్ల మరింత ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అంగన్ వాడీల సేవలను మంత్రి ప్రశంసించారు.

కరోనా కట్టడి కోసం అమలు చేస్తున్న లాక్ డౌన్ సమయంలో అంగన్ వాడీ సేవలు, సరుకులు లబ్దిదారులకు చేరుతున్న తీరు, అంగన్ వాడీ లు ఎదుర్కొంటున్న సమస్యలు, అనుభవాలపై స్త్రీ - శిశు సంక్షేమ శాఖ మంత్రి త్యవతి రాథోడ్ టి.సాట్ ప్రభుత్వ ఛానల్ ద్వారా ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు.

పక్క రాష్ట్రాన్ని సంప్రదించాలన్న సోయి ఏపీకి లేదు

అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాల్సిన బాధ్యత కేంద్రానిదే
కోతికి కొబ్బరి చిప్పదొరికినట్లుగా విపక్షాలు
తెలంగాణ ప్రయోజనాలపై సిఎం కెసిఆర్ రాజీపడరు
స్పష్టం చేసిన మంత్రి శ్రీనివాసగౌడ్

హైదరాబాద్,మే14(ఆర్‌ఎన్‌ఎ): ఎపి రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన 203 జీవోలో కోతికి కొబ్బరికాయ దొరికినట్లు రాష్ట్రంలోని ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో సిఎం కెసిఆర్ రాజీపడరని, పోతిరెడ్డిపాడుపై న్యాయపరంగా పోరాటం చేస్తామని చెప్పారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు విషయంలో తెలంగాణ సిఎం కెసిఆర్, ఎపి సిఎం జగన్ చీకటి ఒప్పందం చేసుకున్నారని తెలంగాణ బిజెపి, కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణకు అన్యాయం చేసే ప్రాజెక్టులకు ఆనాడు కాంగ్రెస్ నాయకులు హారతులు పట్టారని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా కోసం రాష్ట్ర బిజెపి నేతలు కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తేవడంలేదని మంత్రి ప్రశ్నించారు. విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఎపి ప్రభుత్వం ప్రాజెక్టు కడుతోందని మండిపడ్డారు. అక్రమంగా కట్టే ప్రాజెక్టులను అడ్డుకునే బాధ్యత కేంద్రానికి లేదా అని ప్రశ్నించారు. టీఆర్‌ఎస్‌ఎల్పీలో ఆయన మీడియాతో మాట్లాడారు. విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు కడుతోందని మంత్రి పేర్కొన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్, బిజెపి నాయకులు అడ్డుకోకుంటే.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యేదన్నారు. గోదావరి నీటిని కృష్ణాకు మళ్లిద్దామని చెప్పిందే సిఎం కెసిఆర్ అని మంత్రి అన్నారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆనాడు టిఆర్‌ఎస్ మంత్రులు రాజీనామా చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో నిర్మించే ప్రతి ప్రాజెక్టు రోల్ మోడల్‌గా ఉంటోందన్నారు. తెలంగాణకు అన్యాయం జరిగితే సిఎం కెసిఆర్ ఊరుకోరని మంత్రి అన్నారు. నాలుగు రాష్ట్రాలను బతికించే స్థాయికి తెలంగాణ ఎదగిందన్నారు. సిఎం కెసిఆర్ ప్రక్క రాష్ట్రాల సిఎంలతో మాట్లాడి కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేశారని తెలిపారు. ప్రక్క రాష్ట్రాన్ని సంప్రదించాలన్న ఆలోచన ఎపికి ఉండాలన్నారు. పోతిరెడ్డిపాడుకు సహకరించిందే తెలంగాణ కాంగ్రెస్ నాయకులని మంత్రి శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. సిఎం కేసీఆర్ పక్క రాష్ట్రాల సీఎంలతో మాట్లాడి కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేశారని మంత్రి తెలిపారు. పక్క రాష్ట్రాన్ని సంప్రదించాలన్న ఆలోచన ఏపీకి ఉండాలన్నారు. ఏపీ తెచ్చిన 203 జీవోతో ప్రతిపక్షాలు కోతికి కొబ్బరిచిప్ప దొరికినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో నిర్మించే ప్రతి ప్రాజెక్టు రోల్ మోడల్‌గా ఉంటోందన్నారు. తెలంగాణకు అన్యాయం జరిగితే సీఎం కేసీఆర్ ఊరుకోరని స్పష్టం చేశారు. నాలుగు రాష్ట్రాలను బతికించే స్థాయికి తెలంగాణ ఎదిగిందని ఆయన తెలిపారు. గోదావరి నీటిని కృష్ణాకు మళ్లిద్దామని చెప్పిందే సీఎం కేసీఆర్ అని తెలిపారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆనాడు టీఆర్ఎస్ మంత్రులు రాజీనామా చేసిన విషయాన్ని మంత్రి శ్రీనివాస్ గౌడ్ గుర్తు చేశారు.

చర్లపల్లి రైల్వే టర్మినల్ రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

హైదరాబాద్, మే 14: చర్లపల్లి రైల్వే టర్మినల్ రోడ్డు విస్తరణ పనులను మంత్రి మల్లారెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. చర్లపల్లి రైల్వేస్టేషన్ జంక్షన్‌ను అభివృద్ధి చేయడంతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌పై ఒత్తిడి తగ్గుతుందన్నారు. అందుకు అనుగుణంగా చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకునే మార్గాలను విస్తరిస్తున్నామని తెలిపారు. చెంగిచర్ల చౌరస్తా నుంచి రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదుగా పెద్ద చెంగిచర్ల వరకు 100 అడుగుల వెడల్పుతో రోడ్డును విస్తరిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. మేడ్చల్ జిల్లా అభివృద్ధికి సీఎం కేసీఆర్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో చర్లపల్లి రైల్వేస్టేషన్ కీలకంగా మారబోతుందని మంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల రైల్వే అధికారులతో మంత్రి కేటీఆర్ జరిపిన చర్చల్లో చర్లపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి, రోడ్ల విస్తరణ అంశం చర్చకు వచ్చిందని మేయర్ బొంతు రామ్మోహన్ తెలిపారు. చర్లపల్లి రైల్వేస్టేషన్‌ను జంక్షన్‌గా అభివృద్ధి చేయడంతో దూర ప్రాంత రైళ్లరాకపోకలు ఇక్కడి నుంచే జరుగుతాయన్నారు. భవిష్యత్‌లో ఎంఎంటీఎస్ రైలు కూడా చర్లపల్లి రైల్వే టెర్మినల్ వరకు పొడిగించే అవకాశం ఉందని బొంతు రామ్మోహన్ పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.